RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ | 07 ఏప్రిల్ 2026 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:259

## మనవడికి అక్షరాభ్యాసం చేయించిన రేవంత్‌రెడ్డి



నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. దేవస్థానం పునరుద్ధరణ కార్యక్రమాలకు శంకుస్థాపన చేయడానికి ముందు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి కి వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఇదే సందర్భంగా ముఖ్యమంత్రి మనవడికి అక్షరాభ్యాసం చేయించారు.

## బాసర దేవాలయ అభివృద్ధికి శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:ఏప్రిల్ 06, 2026 -- నిర్మల్: నిర్మల్ జిల్లాలోని బాసరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం పర్యటించి, శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్ల వ్యయంతో అమలు చేయనున్న సమగ్ర అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టారు.

ముఖ్యమంత్రి హెలికాప్టర్ ద్వారా బాసరకు చేరుకోగా, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎక్సైజ్ ఌ ప్రొహిబిషన్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు (జిల్లా ఇన్చార్జి మంత్రి), దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎస్పీ జానకి షర్మిల తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

అనంతరం ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రి మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం సమీపంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు సమర్పించారు.

దేవాలయ సమీపంలో రూ.225 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించిన ముఖ్యమంత్రి, అదనంగా రూ.200 కోట్లతో ముధోల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన 'కాఫీ టేబుల్ బుక్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఇందులోని అంశాలను కలెక్టర్ వివరిస్తూ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, మంత్రులకు నిర్మల్‌కు ప్రసిద్ధిగాంచిన కొయ్య బొమ్మలు, పెయింటింగ్స్‌ను జ్ఞాపికలుగా అందజేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, బైంసా మున్సిపల్ చైర్మన్లు అప్పాల కావ్య, దత్తాత్రి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: రేవంత్ రెడ్డి






ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:ఏప్రిల్ 06, 2026 -- ఆదిలాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగుతామని తెలిపారు.బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించిన "ప్రజా పాలన--ప్రగతి బాట" బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ అభివృద్ధిపై తన ప్రభుత్వ ఉక్కు సంకల్పాన్ని చాటారు. కొమురం భీమ్ పోరాట స్ఫూర్తి ఉన్న ఈ నేలను పాలమూరు జిల్లాతో సమానంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలలో విప్లవాత్మక మార్పులు

గత ప్రభుత్వాలు చేయని పలు వినూత్న నిర్ణయాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం వెల్లడించారు. మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించామని, దీనిపై ఇప్పటివరకు సుమారు 10 వేల కోట్లు వ్యయం చేశామని తెలిపారు. మహిళలను కేవలం ప్రయాణికులుగా కాకుండా బస్సుల యజమానులుగా మారుస్తున్నామని, సోలార్ విద్యుత్ ఉత్పత్తిలోనూ వారికి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయానికి హైదరాబాద్ హైటెక్ సిటీలో ప్రత్యేక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పేదల సంక్షేమం కోసం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 22,500 కోట్ల వ్యయంతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని వెల్లడించారు. ఇప్పటికే లబ్ధిదారుల ఖాతాల్లో 5,400 కోట్లు జమ చేసినట్లు చెప్పారు.

మిగతా 2లో





### ఆహార కల్తీ కేటుగాళ్లపై పీడీ యాక్ట్ వంటి కఠిన చర్యలు

## మంత్రి దామోదర రాజ నర్సింహ




హైదరాబాద్ ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్ వాకథాన్లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. జల విహార్ వద్ద వాక్ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. వాక్లో సుమారు వెయ్యి మంది విద్యార్థులు, యువత పాల్గొన్నారు .జలవిహార్ నుంచి ఐమ్యాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకూ ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్ వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్, ఫుడ్ సేఫ్టీ కమిషనర్ సంగీత సత్యనారాయణ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, తదితరులతో కలిసి జల విహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకూ మంత్రి దామోదర్ రాజనర్సింహ నడిచారు.

మిగతా 2లో

### అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ.

### నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ

### సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక



హైదరాబాద్,జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6 హైదరాబాద్, ఏప్రిల్ 6 : జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక గారు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటీని చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

# నరసరావుపేటలో లారీ బీభత్సం:
# డివైడర్‌ను ఢీకొని బోల్తా పడ్డ సిమెంట్ లారీ





నరసరావుపేట: పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డు ఫ్లైఓవర్ సమీపంలో సోమవారం భారీ ప్రమాదం తప్పింది. సిమెంట్ లోడుతో వెళు న్న ఒక లారీ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో లారీ ఒక్కసారిగా రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు లారీ డ్రైవర్ సురక్షితంగా ఉన్నారు.

# జూబ్లీనగర్ కవల ఆడపిల్లల హత్య కేసు ఛేదన
# కన్నతండ్రితో సహా నలుగురు నిందితుల అరెస్ట్




కరీంనగర్ సొంత బిడ్డలనే కాలయముడిలా మారి బావిలో ముంచి చంపిన దారుణ ఘటనలో కన్నతండ్రితో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తిపై మక్కువతో, ఆడపిల్లలనే వివక్షతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో వెల్లడైంది.?ఘటన నేపథ్యం:?కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్ నివాసి కచ్చు శ్రీశైలంప్రతిమ మెడికల్ కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో మౌనికతో ఇతనికి వివాహం కాగా, 2022లో వీరికి కవల ఆడపిల్లలు గీతంశి, గీతన్విక జన్మించారు. అయితే మొదటి నుండి మగపిల్లవాడు కావాలని కోరుకున్న శ్రీశైలంకు, ఆడపిల్లలు పుట్టడం ఇష్టం లేదు. సుమారు 2 కోట్ల విలువైన ఆస్తి ఆడపిల్లల పెళ్లిళ్లకే సరిపోతుందని భావించిన శ్రీశైలం, తన తల్లిదండ్రులు అశోక్, లావణ్య మరియు తమ్ముడు రాకేష్‌తో కలిసి పిల్లలను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు.?పథకం ప్రకారం హత్య:?ఏప్రిల్ 3న, పథకం ప్రకారం నిందితుడు శ్రీశైలం తన భార్యను ఇంట్లోనే ఉండమని చెప్పి, బలవంతంగా ఇద్దరు కుమార్తెలను మోటార్ సైకిల్‌పై పొలం వద్దకు తీసుకెళ్లాడు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి, నలుగురు నిందితులు ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారం, శ్రీశైలం ఇద్దరు చిన్నారులను వ్యవసాయ బావిలోకి తోసివేశాడు. నీటిలో మునిగిపోతున్న గీతంశి ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతుండగా, తనే బావిలోకి దిగి ఆమెను నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ?అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, పిల్లలను కాపాడబోతున్నట్లుగా నటిస్తూ కేకలు వేశాడు.?విచారణ మరియు అరెస్ట్:?నిందితుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సిఐ నిరంజన్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు గోపాల్‌పూర్‌లో తలదాచుకున్నట్లు గుర్తించారు. ఆదివారం నిందితులను అదుపులోకి తీసుకోగా, వారు తమ నేరాన్ని అంగీకరించారు.

## ఉప్పుగుంట పల్లెలో వెలుగు చూసిన చారిత్రక సంపద ....
## 17వ శతాబ్దం నాటి చాముండి విగ్రహం వెలుగులోకి...



కడప మైదుకూరు మండలం ఉప్పుగుంటపల్లె లో దశరథ రామిరెడ్డి, సుధాకర్ రెడ్డి పొలాల్లో నాగులపుట్ట వద్ద పెద్దిరెడ్డి శివశంకర్ రెడ్డి నీటితో శుభ్రం చేస్తుండగా 17వ శతాబ్దం నాటి చాముండి విగ్రహం బయలు పడి,వెలుగులోకి వచ్చినట్టు రచయిత చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ మీడియాకు తెలిపారు.

చండ, ముండ అనే ఇద్దరు రాక్షసులను తన ఖడ్గంతో సంహరించడంతో ఆమెకు చాముండి (చాముండేశ్వరి) అను పేరు వచ్చిందని చెప్పారు. ఈమె పార్వతీదేవి ఉగ్ర అవతారమని,సప్తమాతృకలలో ఒకరిని, ప్రత్యేకమని తెలిపారు. శిల్ప వర్ణన.....ఈ విగ్రహంలో చాముండేశ్వరి దేవి సుఖాసనములో (ఒక కాలు ఆసనముపై పరుండబెట్టి మరియొక కాలు సుఖంగా క్రిందికి విడవడం) కూర్చొని ఉందని చెప్పారు. కుడికాలు క్రింద ఒక తల, ఎడమ కాలు కింద రెండు తలలు (ముండా అనే రాక్షసుని) ఉన్నాయన్నారు. తలపై కిరీటం, కళ్ళు పెద్దవిగా, ముక్కునొక్కుపోయినట్లుగా, చెవులకు పెద్దపెద్ద లోలాకులు ధరించి ఉందని వివరించారు. మెడలో కంటె,శేరు ధరించినట్లు, స్థనాలను ప్రస్ఫుటంగా శిల్పీకరించారు. ఉదరం బక్క చిక్కినట్లుగా, (సింహ మధ్యమం) సన్నని నడుంఅద్భుతంగా చెక్కారన్నారు. ఉదరం నుంచి పిక్కల వరకు అర్ధచంద్రాకృతిలో ఉన్న వస్త్రాలను ధరించినట్లుందని తెలిపారు. కుడివైపు పై చేతిలో ఢమరుకం కింది చేతిలో ఖడ్గం, ఎడమ వైపు కింది చేతితో రాక్షసుని తల కేశాలను పట్టుకున్నట్లుగా, పై చేయి లో త్రిశూలం పట్టుకున్నట్లుగా చూపరులను ఆకర్షించే విధంగా చిత్రీకరించారన్నారు. చేతులలో కేయురాలు, ముంజేతి వలయాలు ఉన్నాయని చెప్పారు.

స్థానిక ఆచారాలు.... నెల్లూరు జిల్లాలోని పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి తిరుణాల మరుసటి దినం పౌర్ణమి రోజున ఉప్పుగుంటపల్లె మొలకల (కుంపటిలో సొద్దులు ,జొన్నలు, ఉలవల విత్తనాలు మొలకెత్తడం) పండుగ జరపడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.ఇక్కడ చాముండి దేవత ఉందని మాకు తెలియదని గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

×స్థానిక కథ .....

పెద్దిరెడ్డి అబ్బిరెడ్డి ఇంట్లో తిరుమల రామయ్య యాదవ్ పాలేరుగా పనిచేసే వారన్నారు. ఇతనికి ఒక రోజు పెంచలకోనల లక్ష్మీనరసింహస్వామి ఒళ్ళులోకి రావటంతో అబ్బిరెడ్డి ఇంట్లో దేవుని మూల లో ఇసుకను ఏర్పాటు చేశాక ఆ ఇసుకలో స్వామి పాదాలు పడ్డాయని గ్రామస్తులు కథలుగా చెబుతున్నారని రచయిత వివరించారు. ఆ పాదాల కొలతలను తీసుకొని తయారుచేసిన పాదుకలు ఇప్పటికీ ఉండడం గమనార్హమని వివరించారు. వీటిని ఇప్పటికీ ఉప్పుగుంటపల్లె మొలకల తిరుణాలకు తీసుకురావడం ఆనవాయితీగా వస్తుందని వెల్లడించారు.

# అవినీతికీ పాల్పడిన హౌసింగ్ అధికారులను విధుల నుండి తొలగించరా
## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దలపల్లి ప్రభాకర్

బ్రహ్మంగారిమఠం ఉ గతంలో మైదుకూరు హౌసింగ్ కార్యాలయంలో ఎంఐసీలు మరియు వర్క్ ఇన్స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న అధికారులు అవినీతికి పాల్పడినట్లు రుజువైన విధుల నుండి తొలగించకపోవడం వెనుక అంతర్యం ఏమిటని అఖిల భారత యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు పెద్దల్లపల్లి ప్రభాకర్ ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ.........మైదుకూరు నియోజకవర్గం లోని బ్రహ్మంగారి మఠం మండలంలో మండల హౌసింగ్ అధికారిగా పనిచేస్తున్న కే నాగజ్యోతి మరియు మైదుకూరు హౌసింగ్ అధికారిగా పనిచేస్తున్న ప్రమోద్ కుమార్ లతోపాటు వర్క్ ఇన్స్పెక్టర్లు రామచంద్రయ్య, సుహాసిని లు గతంలో మైదుకూరు హౌసింగ్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో భారీస్థాయిలో అవినీతికి పాల్పడి స్టీలు, సిమెంటు బ్లాక్ మార్కెట్లో అమ్ముకున్నారని వివిధ పత్రికల్లో రావడం ద్వారా విజిలెన్స్ డి ఈ చంద్రశేఖర రాజు గతేడాది మార్చి 11న మైదుకూరు రూరల్ మరియు అర్బన్ హౌసింగ్ గోడౌన్లలో తనిఖీలు జరిపి గోడౌన్లలో ఉన్న స్టాకు ఆన్లైన్లో ఉన్న స్టాకు తేడాలు ఉన్నాయని మార్చి 17న విజిలెన్స్ సి ఈ చీఫ్ విజిలెన్స్ అధికారి విజయవాడకు నివేదిక లు అందజేయగా భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ధ్రువీకరించి హౌసింగ్ కార్పొరేషన్ ఎండి శివప్రసాద్ గారు ఆగస్టు 2025లో కడప జిల్లా కలెక్టర్ గారికి పైన పేర్కొన్న అధికారులు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారు వీరు కాజేసిన ప్రజాధనాన్ని తిరిగి కట్టించుకొని వీరిని విధుల నుండి తొలగించమని ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ జిల్లా అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం వెనక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పైగా అవినీతికి పాల్పడిన అధికారులు ఎక్కడికక్కడ విధుల్లో కొనసాగేలా మౌనం వహించడం పట్ల జిల్లా అధికారులకు ఎంత భారీ మొత్తంలో ముడుపులు అందాయో అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఇంత భారీ మొత్తంలో అవినీతికి పాల్పడ్డారని రుజువైనా కూడా జిల్లా అధికారులు వీరిని విధుల నుండి తొలగించకపోవడం వెనక అంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. అయితే అవినీతికి పాల్పడిన వీరిని విధుల నుంచి తొలగించకపోవడంతో పైన పేర్కొన్న అవినీతి అధికారులు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న చోట కూడా భారీ స్థాయిలో అవినీతి చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఆరోపణలపై జిల్లా అధికారులు స్పందించడం లేదు. గతంలో వీరు చేసిన అవినీతిపై చర్యలు తీసుకొని విధుల నుండి తొలగించి ఉంటే ఈ పరిణామాలు జరగకపోవచ్చు అని వారు తెలిపారు. పైగా మఠం మండలం ఏఈగా పనిచేస్తున్న నాగజ్యోతి కి మరల ఖాజీపేట మండలం ఇన్చార్జి ఏఈగా బాధ్యతలు ఇవ్వడంతో వారి అవినీతికి హద్దే లేకుండా పోతుందని వారు ధ్వజమెత్తారు. ఇప్పటికైనా పై అవినీతికి పాల్పడిన అధికారులపై తక్షణమే విడుదల నుండి తొలగించి వారు కాజేసిన ప్రజాధనాన్ని తిరిగి కట్టించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# ప్రొద్దుటూరు అగస్త్యేశ్వరాలయం?వేద పాఠశాలలో... హైడ్రామా..



కడప జిల్లా పొద్దుటూరు లోని అగస్త్యేశ్వర స్వామి ఆలయ వేద పాఠశాల వేదికగా తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది.. అక్కడికి విచారణ నిమిత్తముట్టిన అధికారులకు ఆలయ కమిటీకి తీవ్రవాదం జరిగినది.?అధికారులను నిలదీసిన చైర్మన్.. అవినీతిపై విచారణకు వచ్చిన అధికారులను ఆలయ చైర్మన్ వంగల నారాయణరెడ్డి మరియు కమిటీ సభ్యులు ప్రశ్నించారు..?సస్పెన్షన్ వేటు ఎక్కడ అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకుండా విచారణలు ఏంటని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు..?తప్పు చేసిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని అధికారులతో చైర్మన్, సభ్యులు వాగ్వాదం చేశారు..పోలీసు బందోబస్తు మధ్య అవినీతి విచారణ కొనసాగుతోంది..విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారంటూ పాలకమండలి సభ్యుల ఆందోళన వ్యక్తం చేశారు..చైర్మన్ వర్గీయుల నిలదీతతో వేద పాఠశాల వద్ద నెలకొన్న అశాంతి నెలకొంది..

# మార్కెట్లోకి 5 కేజీల గ్యాస్ సిలిండర్..!!




కడప బ్యూరో గ్యాస్ సిలిండర్ అంటే ఇప్పటివరకు 14.2 కిలోల ఇంట్లో వాడే సిలిండర్, హోటల్స్, రెస్టారెంట్ల లాంటి వ్యాపారాలకు వాడే 19 కిలోల సిలిండర్ గురించి మనందరికీ తెలుసు...!! అయితే ఇప్పుడు 5 కిలోల సిలిండర్లు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. ఈ మేరకు అన్ని గ్యాస్ కంపెనీలు 5 కేజీల సిలిండర్‌ను ప్రవేశపెట్టాయి. ఇటీవల గ్యాస్ సరఫరాలో అంతరాయం కలిగిన క్రమంలో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇండేన్, భారత్ గ్యాస్, హెచ్ పీ గ్యాస్ కంపెనీలన్నీ ఈ చిన్న సిలిండర్లను మార్కెట్లోకి తెచ్చాయి. అద్దెఇళ్లల్లో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు, వలస కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుంది. దీని వివరాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. అడ్రస్ అవసరం లేదు ఇప్పటివరకు గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలంటే అడ్రస్ ప్రూఫ్ అవసరమయ్యేది. అలాగే అప్లికేషన్ ఫారంలు పూర్తి చేయాల్సి వచ్చేది. అయితే 5 కిలోల గ్యాస్ సిలిండర్ తీసుకోవాలంటే ఎలాంటి అడ్రస్ ప్రూఫ్ సమర్పించాల్సిన అవసరమే లేదు. కేవలం ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుంది. మీ సమీపంలోని ఏ గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి అయినా అప్పటికప్పుడు దీనిని తీసుకుని వెళ్లవచ్చు. గ్యాస్ సిలిండర్ రీఫిల్లింగ్‌కు ముందే బుక్ చేసుకుంటే ఇంటికి రావడానికి సమయం పడుతుంది. అదే ఈ చిన్న సిలిండర్‌ను మీ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయానికి లేదా సమీపంలోని దుకాణాల్లో సులువుగా రీఫిల్లింగ్ చేసుకోవచ్చు. తక్కువ ధరకే..!! ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఛోటు పేరుతో 5 కేజీల సిలిండర్ లాంచ్ చేసింది. పెట్రోల్ పంపుల్, కిరాణా దుకాణాలు, సూపర్ మార్కెట్లు, ఇండేన్ పంపిణీదారుల వద్ద దీనిని కొనుగోలు చేయవచ్చు. ఏ నగరంలో అయినా దీనిని వినియోగించుకోవచ్చు. ఇక భారత్ గ్యాస్ మినీ సిలిండర్ అయితే మీ ఇంటి వద్దకే వచ్చేస్తుంది. 1800224344 నెంబర్‌కు కాల్ చేస్తే రెండు గంటల్లోనే మీ ఇంటికి డెలివరీ చేస్తారు . అయితే రూ.25 డెలివరీ ఛార్జీ కట్టాల్సి ఉంటుంది. ఇక హెచ్ పీ గ్యాస్ అప్పు పేరుతో 5 కేజీ ల సిలిండర్ ప్రవేశపెట్టింది. పెట్రోల్ బంకులు, విక్రయ కేంద్రాలు, కిరాణా దుకాణాల్లో దీనిని పొందవచ్చు.

### పోరుమామిళ్ల మండలం లో ఘనంగా
### భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు :

పోరుమామిళ్ల భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పోరుమామిళ్ల మండలం అంబేద్కర్ సర్కిల్ లో బీజేపీ జెండా ఎగురవేసి , భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న పాలనా , దేశ ప్రజల కోసం చేస్తున్న అభిరుద్ధి ,దేశం గర్వపడేలా అభిరుద్ధి చేస్తున్నారని కొనియాడటం జరిగింది . బద్వేల్ తాలూకా లో పెద్ద ఎత్తున అభిరుద్ధి , జాతీయ రహదారుల నిర్మాణం కోసం కేంద్రం సహాయ పడింది అని చెప్పడం జరిగింది . పార్టీ కార్యకర్తలు అందరు పార్టీ ఎదుగుదల కోసం శక్తిమేర పని చేయాలన్నారు . ఇందులో బీజేపీ సీనియర్ నాయకులూ పందరి , రమణాచారి , బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుప్రజ , పోరుమామిళ్ల బీజేపీ అధ్యక్షుడు నాగేంద్ర , ప్రధాన కార్యదర్శి దుల్ల శ్రీనివాసులు రెడ్డి , ఉండేలా శ్రీనివాసులు రెడ్డి , ఫణి రావు శర్మ , రవీంద్ర రెడ్డి ,కాశం గురయ్యా ,సాయి కుమార్ ,భరత్ , తమ్మిశెట్టి రమణ , బ్రహ్మయ్య , పెద్ద ఎత్తున పార్టీ అభిమానులు , కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం

బ్రహ్మంగారిమఠం భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బ్రహ్మం సాగర్ రహదారిలో భారతీయ జనతా పతాకావిష్కరణ ను మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్ రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. భారతీయ జనతా పార్టీ అది పెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. అందరినీ కలుపుకొని బిజెపి అని అన్నారు బిజెపి కార్యకర్తల పార్టీ అని కార్యకర్తల త్యాగాల వాళ్ళని పార్టీ ఈరోజు ఈ స్థాయికి వచ్చిందన్నారు కార్యక్రమంలో పోలు అంకిరెడ్డి సుధాకర్ రమణ బ్రహ్మయ్య పూజారి నరసింహులు తదితరులు పాల్గొన్నారు .

# 'మావిగన్' ట్రెండింగ్...

విజయవాడ, ఏప్రిల్ 5,సోషల్ మీడియాలో ప్రతీ రోజూ చాలా ట్రెండ్ అవుతుంటాయి. అలా ఫేమస్ అయిన పదాలు, క్రైమ్ స్టోరీస్, రియల్ సంఘటనలను మూవీస్‌గా తెరకెక్కించడం మనం చూశాం. కొన్నింటిని సాంగ్ లిరిక్స్‌లోనూ వాడుతుంటారు. గతంలో చాలా వరకూ అలాంటి ట్రెండింగ్ వర్డ్స్ సినిమాలుగా వచ్చాయి. తాజాగా అలాంటి రీసెంట్ వర్డ్‌ను మూవీ టైటిల్‌గా రిజిస్టర్ చే?యించినట్లు ప్రచారం సాగుతోంది.గత రెండు రోజులుగా ఏ నోట విన్నా, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మావిగన్ పేరే వినిపిస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజా ప్రెస్ మీట్‌లో ఈ కొత్త పదాన్ని ఇంట్రడ్యూస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సందర్భంగా... ఆయన ప్రెస్ మీట్ పెట్టారు. ఈ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించారు. ఈ క్రమంలో జగన్ ప్రెస్ మీట్‌లో మచిలీపట్నం - విజయవాడ - గుంటూరు ప్రాంతాలను కలుపుతూ రాజధాని ఏర్పాటు చేయాలంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. మచిలీపట్నంలో ఓం, విజయవాడలో ఎవి, గుంటూరులో ఉజఔను తీసుకుని మావిగన్ అని పేరు పెట్టాలని సూచించారు. ఈ పేరు నచ్చకపోతే అమరావతి పేరుతోనే ఆ ప్రాంతాన్ని కాపిటల్‌గా చేయాలని అన్నారు. దీంతో ఆ పేరు మార్మోగుతోంది.మావిగన్ ప్రతిపాదనపై జగన్ సపోర్టర్స్ ఆయనకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే... కొందరు వైసీపీ అధినేతపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు సైతం భవిష్యత్తులో మావిగన్ రాజధాని అవుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలా ఈ పదం వైరల్ అయ్యింది.ఈ క్రమంలో పేరుతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఫిలిం ఛాంబర్‌లో టైటిల్ రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ పేరుతో మూవీ తీయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మరి పేరుతో ఎలాంటి జానర్ మూవీ తీస్తారో అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. పొలిటికల్ జానర్ అయితే బెటర్ అంటూ సలహాలు ఇస్తున్నారు.

ఆచరణలో ఎపుడయ్యేన్ ?

ఏపీలో ప్రధాన ప్రతిపక్షం వైసీపీ ఒక ప్రతిపాదన అమరావతి రాజధానికి ఆల్టర్నేషన్ గా చేసింది. దానిని ప్లాన్ బీగా చెప్పుకుంటోంది. దానికి మావిగన్ అని పేరు కూడా పెట్టారు. అయితే ప్రత్యర్థులతో పాటు విమర్శలు బుద్ధి జీవులు అంతా అది మావిగన్ కాదు ఎండమావిగన్ అని అంటున్నారు. ఎందుకంటే ఈ ప్రతిపాదన చాలా ఆలస్యంగా వచ్చింది. అంతే కాదు ఇపుడు ఏపీలో ఉన్న పరిస్థితుల్లో దీని సాధ్యాసాధ్యాలు పరిశీలించిన వారు అయ్యేది ఉండదని అంటున్నారు..

అది ఆచరణలో అయ్యేనా అంటే కాదనే చెబుతారు. ఎందుకంటే అమరావతికి ఇపుడు చట్ట బద్ధత అనే రాజ్యాంగ భద్రత ఉంది. అంతే కాదు న్యాయపరమైన రక్షణ కూడా ఉంది. అమరావతి రాజధానిగా ఏపీకి నిర్ణయిస్తూ పార్లమెంట్ ఆమోదించింది. రాష్ట్రపతి రాజ ముద్రతో ఇక రావడమే ఆలస్యం. అది కూడా జరిగి తీరుతుంది. అలాంటి అమరావతిని కదపడం సాధ్యమా అంటే అసాధ్యం అని రాజ్యాంగ నిపుణులు అంటున్నారు: ఇక రేపటి రోజున ఏపీలో వైసీపీ అధికారం చేపడితే అమరావతికి బదులుగా మావిగన్ అంటూ రాజధాని మార్పు చేయడం సాధ్యమేనా అంటే కాదనే చెబుతారు. ఎలా అంటే పార్లమెంట్ లో మెజారిటీ సభ్యులు విభజన చట్టంలోని సవరణను ఆమోదించాలి. నిన్న అంతా చూశారు, అధికార బీజేపీ విపక్ష కాంగ్రెస్ సహా దేశంలోని అన్ని పార్టీలు అమరావతికి జై కొట్టాయి. మళ్లీ అమరావతి కాదు మావిగన్ పేరుని చేర్చాలని అంటే మాత్రం వారు ఎందుకు అంగీకరిస్తారు. పైగా అక్కడ అప్పటికి ఎంతో కొంత నిర్మాణాలు జరుగుతాయి కదా ఆ భూములను ఏమి చేస్తారని ప్రశ్నించకుండా ఉండరు కదా అని మేధావులు అంటున్నారు. ఇక 2019లో అయితే అమరావతిలో ఏమీ వర్క్ జరగలేదు కాబట్టి వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులు అని ప్రతిపాదించగలిగింది.

అయినా సరే న్యాయ స్థానాలలో అది వీగిపోయింది. కానీ ఎంత కాదనున్నా 2029 నాటికి అమరావతి రాజధానికో కీలక ప్రభుత్వ భవనాల నిర్మాణం జరుగుతుంది. ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన భూములలో నిర్మాణాలు జరిగితే యాక్టివిటీ స్టార్ట్ అవుతుంది. కానీ ఆ విషయం ఎవరూ చెప్పలేరు కానీ కూటమి ప్రభుత్వం అయితే పట్టుదలగా ఉంది కాబట్టి ఈ విషయంలో కొంత మేర ప్రగతి కనిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఎవరైనా ముందుకు సాగుతారు తప్ప వెనక్కి వెళ్ళేది ఉండదు, దాంతో రేపటి రోజున వైసీపీకి అధికారం దఖలు పడి ఆ పార్టీ ఎంపీల మద్దతు కేంద్రానికి అవసరం అయినా ఈ విషయంలో మాత్రం కేంద్రం నుంచి సాయం చేసేది ఉండదు, పైగా ఒక చోట రాజధాని అనుకుని కొంత పనులు చేసి మళ్ళీ మారుస్తామంటే జనాలు కూడా నెగిటివ్ అవుతారు అన్నది అంతా గుర్తుంచుకోవాల్సి ఉంది.అయితే వైసీపీ అధికారంలోకి వస్తే మాత్రం మావిగన్ పేరుతో విజయవాడ గుంటూరు, మచిలీపట్నమలో కొంత మేర అభివృద్ధి చేయవచ్చు. లేదా ఇంకా ముచ్చట పడితే సీఎం ఆఫీసు కూడా అక్కడ నుంచి నడపవచ్చు కానీ అమరావతి రాజధాని మాత్రం అలాగే చట్టబద్ధతతో ఉంటుంది.

పైగా అమరావతిలోనే అన్ని ప్రభుత్వ ఆఫీసులు ఉంటే వేరే చోట నుంచి పాలన జరిపించడం కూడా ఆచరణలో అంత సహేతుకం అనిపించుకోదు.

ఏది ఏమైనా మావిగన్ అన్నది ఎండమావిగా మారుతుందా అన్న చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



# విదేశాల్లో పర్యటన చేస్తే. అంతరాలయాల్లో పూజలు నిషేధం

విజయవాడ, ఏప్రిల్ 5, విదేశీ పర్యటనలు చేసి వచ్చిన అర్చకులు దేవాలయాల్లోని ప్రధాన గర్భాలయాల్లోకి ప్రవేశించి పూజలు నిర్వహించడంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. దేవాదాయ శాఖ (ధార్మిక పరిషత్), శృంగేరి శారదా పీఠం గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా అమలు చేయాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ నిబంధనల ప్రకారం, విదేశాలకు వెళ్లొచ్చిన అర్చకులు గర్భాలయంలోకి ప్రవేశించడానికి వీలులేదని, ఈ ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, దేవాదాయశాఖ కమిషనర్‌పై ఉందని ఏపీ కోర్టు పేర్కొంది.విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి చెందిన శ్రీచక్ర నవావరణ అర్చన పారాయణదారు డీఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం సోమయాజి దాఖలు చేసిన పిటిషన్‌పై ఏపీ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. 2010లో దేవాదాయ శాఖ జారీ చేసిన సర్క్యులర్, అలాగే 2024 డిసెంబరులో శృంగేరి శారదా పీఠం జగద్గురువులు శ్రీ భారతీతీర్థ స్వామి వారు విడుదల చేసిన ప్రామాణికమైన మార్గదర్శకాలను ఆలయాల్లో పాటించడం లేదని పిటిషనర్ తరఫు న్యాయవాది కేఆర్ శ్రీనివాస్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాస్త్ర నిబంధనలకు విరుద్ధంగా విదేశీ పర్యటన చేసిన వారిని గర్భాలయ పూజలకు అనుమతించడం ఆచార విరుద్ధమని వాదించారు.శృంగేరి శారదా పీఠం జగద్గురువులు మహాతీర్థ భారతీస్వామి నిబంధనల ప్రకారం, అర్చకులు విదేశాలకు వెళ్లడంపై ఆంక్షలు ఉన్నాయి. ఒకవేళ ఎవరైనా వెళ్లాల్సి వస్తే, వారు తిరిగి వచ్చిన తర్వాత కేవలం ఆలయం వెలుపల జరిగే పూజలు, వ్రతాలకు మాత్రమే పరిమితం అవుతారు. గర్భాలయంలో పూజలు నిర్వహించే వారు ఖచ్చితంగా త్రికాల సంధ్యావందనం, వేద అధ్యయనం, ఆహార నియమాలతో పాటు కఠిన ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటించాలని శారదా పీఠం గతంలోనే స్పష్టం చేసింది. అదే నిబంధనలు చాలా చోట్ల అమలవుతున్నాయి. విదేశాలకు వెళ్లిన వారు లేదా సంప్రదాయాలకు విరుద్ధంగా జుట్టు కత్తిరించుకున్న వారు (క్షవరం చేయించుకున్న వారు) గర్భాలయ ప్రవేశానికి అనర్హులని కోర్టు గుర్తు చేసింది. ఈ నిబంధనలను తప్పకుండా పాటిస్తామని దేవాదాయ శాఖ తరఫు న్యాయవాది కోర్టుకు విన్నవించారు

## మధురవాడలో మద్యం మత్తులో కారు బీభత్సం

## చిన్నారికి గాయాలు.

## వైయస్సార్ కాలనీలో ఘటన?

మధురవాడ: ఆదివారం రాత్రి ఐటీ సెజ్ రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ మీదుగా ఓ యువకుడు మద్యం మత్తు లో కారుతో బీభత్సం సృష్టించాడుఅతివేగంతోఅడ్డదిడ్డంగా కారు నడుపుతూ రోడ్డు పక్కన పార్కింగ్ చేసి ఉన్న వాహ నాలను ఢీకొట్టాడు. ఈ క్రమం లో ఓ చిన్నారికి గాయా లయ్యాయి ?ప్రజలు భయాం దోళనతో పరుగులు తీయగా స్థానిక యువత కారును వెంబడించి కొమ్మాది జంక్షన్ వద్ద అడ్డుకున్నారు అప్పటికే పూర్తి మత్తులో ఉన్న డ్రైవర్ కారు దిగి రోడ్డుపైనే కూర్చుండిపోయాడు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

# ఆ ఐదుగురు హిట్ లిస్టే...

గుంటూరు, ఏప్రిల్ 5, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పేశారు. తరచూ వివాదాల్లో ఇరుక్కునే ఎమ్మెల్యేలు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగానే మిగిలిపోతారని చెప్పారు. అంటే ఎమ్మెల్యేలకు స్పష్టంగా చెప్పేశారు. ఏమాత్రం వివాదాల్లో ఇరుక్కున్నా తాను టిక్కెట్ ఇచ్చేది లేదని ఆయన చెప్పకనే చెప్పారు. ఇప్పటికిప్పుడు చర్యలు ఉండకపోవచ్చు. కానీ భవిష్యత్ లో మాత్రం వారికి టిక్కెట్ ఇచ్చే విషయంలో ఈ వివాదాలన్నీ కౌంట్ అవుతాయని చంద్రబాబు ఎమ్మెల్యేలకు చెప్పకనే చెప్పేశారు. ఎన్ని సార్లు చెప్పినప్పటికీ వారు చెవికెక్కించుకోకపోవడంతో పాటు ఇంకా ఎమ్మెల్యేలు రెచ్చిపోతుండటంతో చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారంటున్నారు.ఇటీవల టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు వరస వివాదాల్లో చిక్కుకుంటున్నారు. అనేక మంది అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని పార్టీకి, ప్రభుత్వానికి ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా మంది ఎమ్మెల్యేలు గీత దాటినట్లు చంద్రబాబుకు స్పష్టంగా అర్థమయింది. వారికి షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ అయితే తీసుకున్నారు కానీ, సస్పెండ్ చేయలేదు. సస్పెండ్ చేయకపోనంత మాత్రాన చేతకాని తనం అని చూస్తూ ఊరుకోవద్దని అన్నారు. గీత దాటితే ఖచ్చితంగా సస్పెండ్ చేస్తామని చెప్పారు. అలాగే వైఖరి కొనసాగితే సింగిల్ టైమ్ ఎమ్మెల్యేగా మిగిలిపోతారని హింట్ ఇచ్చారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్, నరసరావు పేట ఎమ్మెల్యే అరవింద బాబు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం లుమాత్రం ట్రబుల్ లో ఉన్నట్లేనని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వెను వెంటనే వీరిపై చర్యలు తీసుకోకపోయినప్పటికీ వచ్చే ఎన్నికల్లో వీరి స్థానంలో కొత్త నేతలకు అవకాశం ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయినట్లు తెలిసింది.ఎవరు తోక జాడించినా.. ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం లేదు కానీ, వచ్చే ఎన్నికల్లో మాత్రం టిక్కెట్ లభించదన్నది స్పష్టంగా చంద్రబాబు చెప్పినట్లయింది. ఇప్పటికైనా ఎమ్మెల్యేల్లో మార్పు వస్తుందా? లేదా?అన్నది చూడాల్సి ఉంది.

కాఫీ కబుర్లతో ఆకట్టుకుంటున్నలోకేష్

కాఫీ కబుర్లు' పేరుతో టిడిపి నిర్వహిస్తున్న కార్యక్రమాలకు మంచి స్పందన లభిస్తోంది. టిడిపి కేంద్ర కార్యాలయంలో గత కొన్ని రోజులుగా పార్టీ క్షేత్రస్థాయి కార్యకర్తలకు, అదే విధంగా క్లస్టర్ ఇన్చార్జిలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలి.. ప్రత్యర్థుల పై ఏ విధంగా పై చేయి సాధించాలి... అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లే విషయంపై తర్ఫీదు ఇస్తున్నారు. చంద్రబాబు సహా మంత్రి లోకేష్ తీసుకువస్తున్న పెట్టుబడులు, కల్పిస్తున్న ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లే అంశాలపై ఏ విధంగా ప్రచారం చేయాలని అంశాలను వారికి వివరిస్తున్నారు. తద్వారా వచ్చే ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీని గెలుపు గుర్రం ఎక్కించడమే లక్ష్యంగా ఈ శిక్షణ జరుగుతోంది. దీనిలో భాగంగా 'కాఫీ కబుర్లు' అనే పేరుతో వినూత్న కార్యక్రమాన్ని కూడా అమలు చేస్తున్నారు.. దీనిని ప్రధానంగా ముఖ్యమంత్రి, పార్టీ అధినేత చంద్రబాబు, అదేవిధంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో నారా లోకేష్ రెండుసార్లు పార్టీ కార్యాలయానికి వచ్చారు. చంద్రబాబు సైతం రెండుసార్లు పార్టీ ఆఫీస్ కి వచ్చారు. ఈ సందర్భంగా 'కాఫీ కబుర్లు' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలు, పార్టీలో నాయకులకు -కార్యకర్తలకు మధ్య ఉన్న రిలేషన్ అడిగి తెలుసుకుంటున్నారు. ఏవిధంగా ముందుకు సాగాలి. ఉన్నత స్థాయి ప్రజల నుంచి క్షేత్రస్థాయిలో సాధారణ ప్రజల వరకు పార్టీని ఏ విధంగా ముందుకు నడిపించాలనే అంశంపై వారు చర్చిస్తున్నారు.

ఈ కార్యక్రమంలో చిత్రమైన విషయం ఏమిటంటే అందరితోపాటు కూర్చుని కాఫీ తాగుతూ వారితో ముచ్చటించడం. ఎవరు ఏం చెప్పినా వినే అవకాశం ఇవ్వడం... ప్రధానంగా కార్యకర్తలను ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో వ్యక్తిగత అంశాలకు కూడా ప్రాధాన్య ఇస్తున్నారు. కొంతమంది కార్యకర్తలు తమ కుటుంబాలకు సంబంధించిన అంశాలను కూడా ప్రస్తావిస్తుంటే ఓపికగా వింటున్నారు.

పార్టీ పరంగా అయితే వారు చెప్పింది వింటూనే మరికొన్ని సలహాలు సూచనలు ఇస్తున్నారు. మొత్తంగా 'కాఫీ కబుర్లు' కార్యక్రమం టిడిపిలో ఒక ఆసక్తికర పరిణామంగా మారింది. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమం పట్ల ఆసక్తి నెలకొంది. ఈ తరహా కార్యక్రమం నిర్వహించడం టిడిపికి ఇదే తొలిసారి. గతంలో బిజెపి 'చాయ్ పే చర్చా' వంటి కార్యక్రమం చేపట్టిన విషయం తెలిసిందే. అదే తరహాలో టిడిపి కాఫీ కబుర్లు పేరుతో కార్యక్రమాన్ని ఎంచుకుని నిర్వహించడం ద్వారా కార్యకర్తలకు మరింత చేరువ అయ్యేలా వ్యవహరిస్తోంది.

# టీడీపీకి మరింత మంది మహిళా లీడర్లు...

కాకినాడ, ఏప్రిల్ 5, టీడిపికి మరింత మంది మహిళలు అవసరం అవుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం పార్టీలో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు పార్టీ అధినేత సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే ఏర్పాటు చేయనున్న రాష్ట్రస్థాయి కమిటీలో మహిళల రిజర్వేషన్ పెంచాలని భావిస్తున్నారు. తద్వారా 33% మేరకు పార్టీ పదవుల్లో ముఖ్యంగా రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళలకు అవకాశం దొరుకుతుంది. ఇది ఒక రకంగా పార్టీ ఆవిర్భావం తర్వాత సంచలన నిర్ణయం అనే చెప్పాలి. ఇప్పటివరకు రాష్ట్రస్థాయి నాయకత్వంలో మహిళా నాయకులకు ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ ఇప్పుడు 33 శాతం మందిని ఖచ్చితంగా నియమించాలని పార్టీ నిర్ణయించింది. తద్వారా మెజారిటీ మహిళ నాయకులకు రాష్ట్రస్థాయి కమిటీలో అవకాశం దొరుకుతుంది. మరోవైపు నియోజకవర్గాల సంఖ్య పెరిగితే.. మహిళా నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు కూడా మరింత మంది మహిళ నాయకులు అవసరం ఏర్పడుతుంది. దాదాపు 80 నియోజకవర్గాలపైగా మహిళలకు కేటాయిస్తారన్న చర్చ నడుస్తున్న నేపథ్యంలో ఆమేరకు మహిళా నాయకత్వాన్ని పెంచుకునేందుకు పార్టీ ప్రయత్నిస్తోంది. దీనికి ప్రధానంగా రెండు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని సమాచారం. 1) సంస్థా గతంగా పార్టీలో ఉన్న మహిళా నాయకులు.

అదేవిధంగా వారసత్వంగా పార్టీకి సేవ చేస్తున్న నేతలు. 2) యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో పార్టీ వేస్తున్న అడుగులు, తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ఆకర్షితులవుతున్న యువతులను పార్టీలోకి తీసుకుని వారికి పదవులు కట్టబెట్టాలని భావిస్తోంది, అయిన ప్పటికీ నాయకత్వం పరంగా చూసుకున్నప్పుడు మహిళల సంఖ్య తక్కువగా ఉంది. ఈ క్రమంలో మహిళా నాయకత్వాన్ని పెంచుకునే దిశగా ఏ విధంగా ముందుకు సాగాలి.. ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలి.. అనే విషయంపై చంద్రబాబు పార్టీ సీనియర్లకు బాధ్యతలు అప్పగించారు. ఎవరిని పడితే వారిని కాకుండా పార్టీకి సంస్థగతంగా ఉండేలాగా సామాజిక వర్గాలపరంగా అదే విధంగా బడుగు బలహీనవర్గాల నుంచి కూడా మహిళా నాయకులను తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. వీరిలో బీసీలు ఎక్కువ మంది ఉండేలా చూడనున్నారు. ఎందుకంటే ఆది నుంచి టిడిపి బీసీలకు ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో వారి తరఫున బలమైన గళం వినిపించే మహిళా నాయకులకు ఇప్పుడు అవకాశం దక్కనుంది. మొత్తంగా టిడిపికి మరింత మంది మహిళా నాయకుల అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

రాయపాటి అరుణకు చాన్స్

రాజధాని అమరావతి ఉద్యమకారిణిగా గుర్తింపు సాధించి కూటమి ప్రభుత్వంలో మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన రాయపాటి శైలజ వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయనున్నారా? ఆమెను పార్టీలో చేర్చుకుని రాజధాని ప్రాంతంలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీకి నిలపాలని టీడీపీ అధిష్టానం భావిస్తోందా? ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలను జాగ్రత్తగా గమనిస్తే ఈ అనుమానాలు నిజమయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు.

2029 ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారని, దీంతో కొత్తగా సమర్థులైన మహిళా నేతలను రంగంలోకి దింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారని అంటున్నారు. రాజకీయ నేపథ్యం నుంచి వచ్చినప్పటికి రాయపాటి శైలజకు ఇప్పటివరకు ఏ పార్టీతో సంబంధం లేదని అంటున్నారు. గతంలో అమరావతి రాజధానిని కాపాడుకునేందుకు రైతులు చేపట్టిన ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన శైలజ టీడీపీ అధిష్టానం దృష్టిని ఆకర్షించారని చెబుతున్నారు. ఆమె కుటుంబానికి టీడీపీతో అనుబంధం ఉన్నప్పటికీ శైలజ మాత్రం ఆ పార్టీ తరఫున ఇప్పటివరకు పనిచేయలేదని, కేవలం అమరావతి ఉద్యమం వరకు పరిమితమయ్యారని అంటున్నారు. ఇక కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి రాజధాని ఉద్యమం కూడా ఒక కారణంగా భావించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అప్పట్లో ఉద్యమంలో ముందుండి నడిపిన రాయపాటి శైలజ తెగువను మెచ్చుకుని మహిళా కమిషన్ గా నియమించారు. ఇక ఇప్పుడు కొత్త నియోజకవర్గాలు ఏర్పాటు అవుతుండటం, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాల్సివుండటంతో రాయపాటి శైలజను పార్టీలోకి తీసుకువచ్చి ఆమె సేవలను రాజకీయంగా వాడుకోవాలని టీడీపీ హైకమాండ్ భావిస్తోందని అంటున్నారు. ప్రస్తుతం మహిళా కమిషన్ చైర్ పర్సన్ గా ఉన్న రాయపాటి శైలజ పదవీకాలం రెండేళ్లు మాత్రమే ఉంటుందని చెబుతున్నారు. ఇప్పటికే సగం పదవీకాలం పూర్తికావడంతో మిగిలిన సమయం ముగిసిన తర్వాత రాయపాటి శైలజను ఏదో ఒక నియోజకవర్గానికి ఇంచార్జిగా నియమించాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. సామాజికంగా ఆర్థికంగా కూడా ఆమె బలంగా ఉండటంతో ఏ స్థానం అప్పగించాలనే విషయమై టీడీపీ హైకమాండ్ తర్జనభర్జన పడుతోందని అంటున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు నియోజకవర్గాలను పరిశీలిస్తున్నారని, అదేవిధంగా కొత్తగా ఏర్పడే నియోజకవర్గాలు, మహిళా రిజర్వేషన్ కు అవకాశం ఉండే స్థానాలను పరిశీలిస్తున్నారని అంటున్నారు.

# కంపు కొడుతున్న బాత్ రూమ్ములు మట్టిలో విద్యార్థులకు భోజనాలు ఎమ్మెల్యే కు షాకిచ్చిన జడ్పీ స్కూల్ తనిఖీలు

కడప ఆకస్మిక తనిఖీ చేసి షాక్ ఇవ్వాలనుకున్న టీడీపీ ఎమ్మెల్యే మాధవి రెడ్డి కి రివర్స్ లో షాక్ తాకింది. కడప నగరం ముతరాసుపల్లి జడ్పీ స్కూల్ ఎమ్మెల్యే మాధవి రెడ్డి ను ఆకస్మికంగా తనిఖీ చేసారు. బాత్రూమ్స్ చూసి ముక్కుమూసుకొని బయటకొచ్చారు. మండుటెండలో మట్టిలో పిల్లలకు భోజన ఏర్పాట్లు చూసి అవాక్కు అయ్యారు . ప్రతి రోజూ భోజనం బాగా వుండడంలేదని విద్యార్థులు మాధవి కి చెప్పారు.

# అమరావతి మార్పు సాధ్యమా...

ఒంగోలు, ఏప్రిల్ 5, అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించింది. అందుకు సంబంధించిన బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందింది. త్వరలో రాష్ట్రపతి సంతకం చేసి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. అయితే దీనిపై మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము అధికారంలోకి వస్తే ఆ బిల్లును మార్చేస్తాం అంటూ కామెంట్స్ చేశారు. ఇప్పుడు బిల్లు పెట్టిన మాదిరిగానే.. తాము చేస్తాం అంటూ చెప్పుకొచ్చారు. అప్పటినుంచి ఆయనకు అనుకూలురు సైతం అదే తరహా వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే అది సాధ్యమేనా అన్న ప్రశ్నకు కొంతమంది విశ్లేషకుల ముసుగులో సాధ్యమే అని చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉంది. అది ప్రజలతో ముడిపడే విషయం కాగా.. మరోవైపు కోర్టు పరిధిలో కూడా ఉంది. ఈ విషయం తెలియక చాలామంది విశ్లేషణల రూపంలో ప్రజల్లో అయోమయాన్ని సృష్టిస్తున్నారు.అమరావతి మార్పు విషయంలో జగన్మోహన్ రెడ్డి చెబుతున్న మాటలను పరిగణలోకి తీసుకుంటే.. ముందుగా ఆయన అంతులేని విజయం సాధించాలి. ఆయనకు అనుకూలమైన ప్రభుత్వం కేంద్రంలో రావాలి. అప్పుడే ఆ బిల్లు మరోసారి మార్పునకు కొంతవరకు అవకాశం ఉంటుంది. అయితే అప్పుడు కూడా అది రాజకీయ అంశంగా మారనుంది. ఎందుకంటే అప్పటికి అమరావతికి ఒక రూపం వస్తుంది. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం జరుగుతుంది. వాటిని మారిస్తే మాత్రం ప్రజావ్యతిరేకత రావడం ఖాయం. ఎందుకంటే ఏ రాష్ట్రం కూడా రాజధానిని మార్పు చేస్తున్న దాఖలాలు లేవు. కానీ జగన్మోహన్ రెడ్డి పదేపదే రాజధానులను మారిస్తే ప్రజలు ఊరుకోరు. రాజకీయాలు విపరీతంగా ప్రభావితం అవుతాయి కూడా. జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డి నవ్వుల పాలవుతారు కూడా. ప్రస్తుతం జగన్ వైఖరి చూస్తుంటే మారుస్తాం అని చెప్పడం లేదు. కేవలం అమరావతి విషయంలో దూకుడుగా ప్రభుత్వం ముందుకెళ్తున్న వేళ.. కొంత రాజకీయ అయోమయం సృష్టించేందుకే ఈ ఎత్తుగడ అని స్పష్టం అవుతుంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీలో తిరుగులేని విజయం సాధించింది. అప్పుడే అమరావతి స్థానంలో మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తెచ్చింది. కానీ అప్పటికే ఏపీ రాజధాని అమరావతి అని రికార్డుల్లో నమోదయింది. ఆయన మూడు రాజధానుల ప్రయత్నం చేస్తున్న సమయంలోను కేంద్ర ప్రభుత్వ రికార్డుల ప్రకారం అమరావతి రాజధాని అని తేలిపోయింది. మరి అంతటి బలంలో కూడా కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన ఒప్పించలేకపోయారు. పాలన వికేంద్రీకరణ కోసమే తాను మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నానని చెప్పలేకపోయారు. ఎందుకంటే అప్పుడు 22 మంది పార్లమెంట్ సభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉన్నారు. తనకు విలువనిచ్చే ఎన్ డి ఏ ప్రభుత్వం ఉంది. పైగా తన రాజకీయ ప్రత్యర్థి చంద్రబాబుకు కేంద్ర పెద్దలు వ్యతిరేకంగా ఉన్నారు. ఆ సమయంలోనే తాను పట్టుబడి తెరపైకి తెచ్చిన మూడు రాజధానులను అమలు చేయలేకపోయారు జగన్మోహన్ రెడ్డి.మరోవైపు న్యాయ చిక్కులను కూడా అధిగమించలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. అమరావతిని కాదని మూడు రాజధానుల అంశాన్ని తీసుకున్నప్పుడు ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించారు అమరావతి రైతులు. వారిని ఎన్నో విధాలుగా ఇబ్బంది పెట్టారు. కేసులతో ఉక్కిరి బిక్కిరి చేశారు. రాజధాని అంటే ఆ 29 గ్రామాలకు సంబంధించిన అంశంగా భావించారు. కానీ అమరావతి రైతులు న్యాయ పోరాటం చేశారు. ఏకంగా హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు డివిజనల్ బెంచ్ అమరావతి రైతులకు అనుకూలంగా తీర్పు చెప్పింది. దీంతో ఇష్టపడని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తలుపు తట్టింది. సుప్రీం కోర్టులో ఆ కేసు పెండింగ్లో ఉంది. కానీ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చట్టపరంగా మూడు రాజధానుల విషయంలో తనకు ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తించింది. ఎందుకంటే అమరావతి రాజధాని విషయంలో రైతులతో ఒప్పందం ప్రధాన అడ్డంకి కానుంది. అందుకే సుప్రీంకోర్టులో కేసు నడుస్తుండగా.. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకున్నట్లు ప్రకటించింది. కేవలం కోర్టులో ప్రతికూలత వస్తుందని భావించి అప్పట్లో ఆ నిర్ణయం తీసుకుంది.తాజాగా అమరావతికి చట్టబద్ధత అనే అంశం తెరపైకి వచ్చినప్పుడు.. విశ్లేషకుల ముసుగులో కొందరు వైసిపి అనుకూలురు కొత్త ప్రతిపాదన తెచ్చారు. పార్లమెంటులో చట్టబద్ధత కంటే రాష్ట్ర ప్రభుత్వ పరంగా సుప్రీంకోర్టులో ఉన్న కేసును వెనక్కి తీసుకోవచ్చు కదా అనేది వారి సూచన. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అదే పని చేసింది. అమరావతి ఏకైక రాజధాని అంటూ అఫిడవిట్ దాఖలు చేసింది. కానీ సుప్రీం కోర్టులో ఆ కేసు విచారణకు రాలేదు. ఒకవేళ వచ్చినా హైకోర్టు అమరావతికి అనుకూల తీర్పు ఇచ్చిన దృష్ట్యా దానికే కట్టుబడి ఉండాలని ఆదేశాలు ఇస్తుందని న్యాయ నిపుణులు సైతం చెబుతున్నారు. ఒకసారి సుప్రీంకోర్టు ఆ తీర్పు ఇచ్చిందంటే మరోసారి.. అమరావతి రాజధాని మార్పు అంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం ఉండదు. అయితే రాజకీయపరంగా చాలా రకాల వ్యాఖ్యలు చేయవచ్చు కానీ.. కొన్నింటిని అధికారంలోకి వచ్చాక అమలు చేయలేం. ఇప్పుడు అమరావతి విషయంలో జగన్మోహన్ రెడ్డికి ఎదురైన పరిస్థితి అదే. అంతులేని మెజారిటీతో ఆయన గెలవాలి. ఆయనకు అనుకూలమైన కేంద్ర ప్రభుత్వం రావాలి. ఆపై సంకీర్ణ ప్రభుత్వంలో మిగతా రాజకీయ పార్టీలు సహకరించాలి. ఇంత జరిగిన తరువాత మాత్రమే రాజధానిని కదిలించగలరు జగన్మోహన్ రెడ్డి. అయితే ఇంతకుముందే అంతులేని మెజారిటీతో గెలిచిన ఆయన అమరావతిని అంగుళం కదిపించలేకపోయారు. ఒకవేళ అధికారంలోకి వచ్చినా ఆయన అమరావతిని కొనసాగించాలి తప్ప వేరే ఆప్షన్ లేదన్న టాక్ కూడా ఉంది. సో ఇప్పుడు ఆయన చేస్తున్న వ్యాఖ్యలంతా కేవలం రాజకీయ గందరగోళం కోసమేనని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. అమరావతి శాశ్వతం అంటున్నారు.

# క్రికెట్ గొడవలో యువకుడి హత్య.



విశాఖ: విశాఖ, ఆరిలోవ,పెద్దగదిలిలో ఆదివారం సాయంత్రం క్రికెట్ గొడవ ఒక యువకుడి ప్రాణం తీసింది.పోలీసుల కథనం ప్రకారం..క్రికెట్ ఆడుతున్న సమయంలో అజిత్(23), కిషోర్(26) మధ్య వివాదం తలెత్తింది.మ్యాచ్ ముగిసిన తర్వాత కిషోర్ ఆగ్రహంతో పెద్దగదిలి జంక్షన్ వద్ద అందరూ చూస్తుండగానే అజిత్పై కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన అజిత్ అక్కడికక్కడే మృతి చెందాడు.సిఐ మల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చిత్తూరు పలమనేరు దగ్గర జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. బెంగళూరు నుంచి తిరుపతి కు వస్తున్న సమయంలో పలమనేరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి కోర్టు లో పనిచేయు చున్న యుగంధర్ జూనియర్ అసిస్టెంట్, హరీష్ మృతి చెందారు. బెంగళూరు లో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఘటన జరిగింది. పలమ నేరు గంగవరం సమీపంలో ముందర వెళుతున్న లారీ ఉన్నట్లుండి ఆగడంతో వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కారులో వున్న మరో నలుగురికి గాయాలు అయ్యాయి.

# మెరుగైన సౌకర్యాలతో అమృత్ భారత్ 3.0

హైదరాబాద్, ఏప్రిల్ 6, రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందించేందుకు భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు సరికొత్త చర్యలు చేపడుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3.0 రైళ్లను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నాల్లో ఉంది. ప్రస్తుతం ఉన్న అమృత్ భారత్ రైళ్లు కేవలం నాన్ ఏసీ బోగీలతో నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమృత్ భారత్ 3.0 రైళ్లలో ఏసీ బోగీలను ఏర్పాటు చేస్తున్నారు. నమూనా కోచ్ను రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం రోజున పరిశీలించారు.రైలు ప్రయాణికులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేందుకు భారతీయ రైల్వే ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతూ ఉంటుంది. ఈ క్రమంలోనే అమృత్ భారత్ రైళ్లను తీసుకువచ్చింది. ఇప్పటికే అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 1.0, అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 2.0 వెర్షన్లు, అందుబాటులోకి రాగా.. త్వరలోనే అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3 .0 ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రైల్వే శాఖ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3.0 శాంపిల్ కోచ్ను న్యూఢిల్లీలో శనివారం పరిశీలించారు. ఈ వీడియోను ఎక్స్ ద్వారా షేర్ చేశారు రైల్వే మంత్రి. ప్రయాణీకుల భద్రత, సౌకర్యాన్ని మెరుగుపరచడానికి, కొత్త డిజైన్లు, మెరుగైన టాయిలెట్ మోడల్స్ అభివృద్ధి చేసిందని రైల్వే మంత్రి తెలిపారు. ఒక బోగిని అప్ గ్రేడ్ చేసి.. రూపొందించిన శాంపిల్ కోచ్ను పరిశీలించినట్లు ట్వీట్ చేశారు.అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3.0 వెర్షన్లో ఏసీ కోచ్లు, కొత్త ఇంటీరియర్ డిజైన్ ఉంటుంది. అలాగే అప్గ్రేడ్ చేసిన ఫీచర్లతో ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలను అందిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఇందులో నాన్-ఏసీ కోచ్లతో పాటు ఏసీ కోచ్లను కూడా ప్రవేశపెట్టనున్నారు. అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3.0 కోసం ప్రతిపాదించిన ఇంటీరియర్ డిజైన్లు, కలర్ స్కీమ్లతో కూడిన నమూనా కోచ్లను శనివారం అశ్వినీ వైష్ణవ్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న అమృత్ భారత్ రైలు సర్వీసుల కంటే అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3.0 రూపకల్పనలో భిన్నంగా ఉంటుంది. ప్రస్తుతం అమృత్ భారత్ రైళ్లల్లో కేవలం జనరల్, స్లీపర్ క్లాస్ మాత్రమే ఉన్నాయి. అయితే అమృత్ భారత్ 3.0 వెర్షన్లో ఏసీ కోచ్లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అమృత్ భారత్ 1.0, 2.0 రైళ్ల నిర్వహణ అనుభవంతో వీటిని రూపొందిస్తున్నారు.అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ 3.0 రైళ్లల్లో నాన్ ఏసీ కోచ్లతో పాటు ఏసీ కోచ్లు ఉంటాయి. అలాగే ఈ రైళ్లు గంటకు 130 కి.మీ వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. రైళ్ల తయారీ పూర్తయిన అనంతరం.. రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్కు అధికారులు పంపిస్తారు. ట్రయల్స్, టెస్టులు పూర్తి అయిన తర్వాత అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉంది. రైలు ప్రయాణికుల సౌకర్యం కోసం వందేభారత్ ఎక్స్ప్రెస్ రైలు, వందేభారత్ స్లీపర్, అమృత్ భారత్ ఎక్స్ప్రెస్ పేరుతో అధునాతన సౌకర్యాలతో భారతీయ రైల్వే.. సర్వీసులు అందుబాటులోకి తెస్తోంది.

# మదనపల్లె తహసీల్దార్ కలెక్టరేట్ కు అటాచ్

## భారీ మొత్తంలో అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు



మదనపల్లె తహసీల్దార్ కిషోర్ కుమార్ రెడ్డిని కలెక్టరేట్ కు అటాచ్ చేస్తూ కలెక్టర్ నిశాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. మదనపల్లె తహసీల్దార్ గా పని చేస్తున్న కిషోర్ రెడ్డి పై ఇదివరకే స్థానిక ప్రజాప్రతినిధి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. డీకేటి భూములు, చుక్కల భూములు ,మిలిటరీ భూములను వెబ్ లాండ్ లో ఎక్కించినట్లు ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పది రోజుల కిందటే జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ కలెక్టరేట్ కు తహసీల్దార్ని పిలిపించుకుని విచారించారు. ఈ క్రమంలో తహసీల్దార్ బ్యాంకు ఖాతాకు పెద్ద మొత్తంలో నగదు బదిలీ అయినట్లు రాష్ట్ర సీసీఎల్ఏ, విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీనిపై ప్రాథమిక విచారణతో కలెక్టర్ నిశాంత్ కుమార్ తహసీల్దార్ కిషోర్ రెడ్డిని కలెక్టరేట్ కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా తహసీల్దార్ వద్ద ఉన్న ప్రభుత్వ సిమ్ కార్డు, రెండు డిజిటల్ కీ లను ఉన్నతాధికారులకు స్వాధీనం చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం.

# ఎన్నికల్లో పోటీకి కమల్ పార్టీ దూరం

చెన్నై, ఏప్రిల్ 6,తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు కమల్హాసన్ పార్టీ మక్కల్ నీది మయ్యమ్ పోటీకి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. కమల్ నిర్ణయం పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్లో ఉన్న కమల్హాసన్.. ఆశించిన స్థాయిలో ఎంఎన్ఎం పార్టీకి సీట్లు సాధిస్తారని భావించారు. కూటమిలో 22కు పైగా పార్టీలు ఉండటం వల్ల మిత్రపక్షాల నుంచి ఎక్కువ డిమాండ్ల రావడంతో సర్దుబాటుకు ఎంకే స్టాలిన్ నానా తంటాలు పడాల్సి వచ్చింది. మొదట్లో కనీసం 10 నుంచి 15 సీట్లు ఇవ్వాలని, తమ పార్టీ గుర్తు టార్చ్లైట్పై పోటీ చేస్తామని కమల్ హాసన్ డిమాండ్ చేశారు.ఇప్పటికే ఆయనకు రాజ్యసభ పదవి ఇవ్వడంతో అన్ని సీట్లు కదరదని, కావాలంటే డీఎంకే గుర్తుతో పోటీకి చేయాలని స్టాలిన్ ప్రతిపాదించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ ప్రతిపాదనపై ఎంఎన్ఎంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో పోటీ నుంచి తప్పుకుని కూటమికి మద్దతు ఇస్తామని కమల్ ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని గొప్పత్యాగంగా స్టాలిన్ అభివర్ణించినా.. కమల్ పార్టీలోని పలువురు ఆశావహులను తీవ్ర నిరాశకు గురిచేసింది. 2019 పార్లమెంట్, గత అసెంబ్లీ ఎన్నికల్లో కమల్ పార్టీ పోటీ చేసినా ఒక్క సీటునూ సాధించలేదు. ఇక, 2024 లోక్సభ ఎన్నికల్లోనూ పోటీకి దూరంగా ఉన్నారు. ఇండియా కూటమికే మద్దతు తెలిపఇదిలా ఉండగా, ప్రస్తుత ఎన్నికల్లో పోటీకి పలువురు ఆశావహుల నుంచి కమల్ హాసన్ దరఖాస్తులను స్వీకరించారు. దరఖాస్తు సమయంలో ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున చెల్లించినట్టు సమాచారం. ఇలాంటి వారు 60 మంది ఉన్నట్టు సమాచారం. కానీ, పోటీ నుంచి తప్పుకున్నట్టు కమల్ ప్రకటించడం వారు మండిపడుతున్నారు. 'ఎన్నికల్లో గెలిచి ప్రజలకు సేవచేయడానికి రాజకీయాల్లోకి వస్తామని, అసలు అటువంటి అవకాశమే లేనప్పుడు పార్టీ ఎందుకు' అని కొందరు నిలదీస్తున్నారు.కోయంబత్తూర్ సౌత్లో మక్కల్ నీది మయ్యమ్ పార్టీకి మంచి కేడర్ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కమల్ హాసన్ ఇక్కడ నుంచే పోటీ చేశారు. ఈ స్థానంలో పోటీ కోసం 8 మంది దరఖాస్తు చేసుకోగా వారికి నిరాశే ఎదురైంది. ఇక్కడ నుంచి డీఎంకే మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి టిక్కెట్ ఇచ్చింది. దీంతో దరఖాస్తు చేసుకున్న నాయకులు విమర్శలు చేస్తున్నారు. పోటీ చేయనప్పుడు తమ డబ్బు వెనక్కు ఇవ్వాలని వారు కోరుతున్నారు. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు ఏప్రిల్ 23న ఎన్నికలు జరగనున్నాయి. మార్చి 30 నుంచి ప్రారంభమైన నామినేషన్లకు గడువు ఏప్రిల్ 7తో ముగియనుంది.

# బడంగ్ పేటలో రూ.122 కోట్లు దోచేశారు

హైదరాబాద్, ఏప్రిల్ 6, ఉన్నతమైన హోదా.. నెలకు లక్షలలోజీతం.. వాటికి మించిన సౌకర్యాలు.. ఇంకా రకరకాల సౌలభ్యాలు.. ఇన్ని ఉన్నప్పటికీ కూడా వారిలో ఆశ చావలేదు. ఇంకా సంపాదించాలని.. మరింత వెనకేయాలని అనుకున్నారు. కానీ చివరికి దొరికిపోయారు.హైదరాబాదు నగర పరిధిలోని బడంగ్ పేట మున్సిపాలిటీ కార్యాలయం ఉంది. ఇది శివారు ప్రాంతం కావడంతో భూ లావాదేవీలు.. ఇతర వ్యవహారాలు భారీగా సాగుతుంటాయి. ఇక్కడ భూముల ధర కూడా విపరీతంగా ఉంది. అందువల్ల తెర వెనుక వ్యవహారాలు చాలా జరిగిపోయాయి. ముఖ్యంగా బడంగ్పేట్ మున్సిపాలిలో పనిచేసే కొంతమంది అధికారులు అక్రమార్కులకు కొమ్ము కాశారు. ప్రభుత్వానికి సొమ్ము వెళ్లకుండా అడ్డుకట్ట వేశారు. ఆ సొమ్ముతో తమ జేబులు నింపుకున్నారు. ఒకటి రెండు కాదు.. ఏకంగా 122 కోట్లు నొక్కేశారుప్రభుత్వ ఆదాయంలో తేడా రావడం.. ప్రభుత్వ ఖాతాకు డబ్బులు జమ కాకపోవడంతో ఉన్నతాధికారులకు అనుమానం వచ్చింది. మరో మాటకు తావు లేకుండా విజిలెన్స్ విచారణకు అధికారులు ఉపక్రమించారు. దీంతో బడంగ్ పేట మున్సిపాలిటీలో అంతర్గత విచారణ కొనసాగించారు.విజిలెన్స్ విచారణలో బడంగ్పేట్ మున్సిపాలిటీలో జరిగిన వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. మొత్తంగా 122 కోట్ల అవినీతి జరిగిందని అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో పదిమంది అధికారులకు పాత్ర ఉందని గుర్తించారు. డిప్యూటీ కమిషనర్ గా పనిచేస్తున్న సరస్వతి.. మరో తొమ్మిది మంది అధికారులు అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. ఆస్తి పన్ను నుంచి మొదలు పెడితే.. వెంచర్లకు అనుమతులు వరకు ఇలా అన్ని విషయాలలో అవినీతికి పాల్పడ్డారు. మొత్తంగా 122 కోట్లను నొక్కేశారు. ప్రాథమిక చర్యగా పదిమంది అధికారులపై సస్పెన్షన్ వేటు వేసిన ప్రభుత్వం.. తదుపరి చర్యలను తీసుకోవడానికి సిద్ధమవుతోంది.ఇటీవల ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మున్సిపాలిటీలో అవినీతి వ్యవహారం జోరుగా సాగింది. సిబ్బంది అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడ్డారు. ఏసీబీ అధికారులకు ఈ విషయం తెలియడంతో రంగంలోకి దిగారు. తనిఖీలు చేపట్టారు. అవినీతికి పాల్పడిన సిబ్బందిని అదుపులోకి తీసుకున్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించగా.. బడంగ్ పేట మున్సిపాలిటీ అయితే అవినీతిలో రికార్డు సృష్టించింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన నేపథ్యంలో.. సంబంధిత అధికారులపై కఠినమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

# వడగాలులు...ఉక్కపోతలు...

హైదరాబాద్, ఏప్రిల్ 6, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. ఉక్కపోత ఉక్కిరి బిక్కిరి చేస్తుంది. ఊపిరి ఆగిపోయేంతగా చెమటలు పడుతున్నాయి. ఇంట్లో కూర్చున్నా, బయటకు వచ్చినా వేడిగాలుల సెగతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు ఇప్పటికే వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పలు చోట్ల పిడుగులు కూడా పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని చోట్ల మాత్రం తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశముందని తెలిపింది.ఆంధ్రప్రదేశ్ లో శనివారం 73 మండలాల్లో తీవ్రవడగాలులు, 17 మండలాల్లో వడగాలులు, ఆదివారం 32 మండలాల్లో తీవ్రవడగాలులు, 21 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈరోజు శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరం 24, పార్వతీపురంమన్యం 15, అల్లూరి 3, పోలవరం 9, అనకాపల్లి 2, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాల్లో తీవ్రవడగాలులు(73) వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం 2, పోలవరం 2, అనకాపల్లి 1, కాకినాడ 2, తూర్పుగోదావరి 3, ఏలూరు 4, ఎన్టీఆర్ 1, పల్నాడు 2 మండలాల్లో వడగాలులు(17) ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. ఏపీలో పలు జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరిక జారీ చేసింది. 40-60కిమీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది.తెలంగాణలోనూ ఉష్ణోగ్రతలు భారీగా నమోదవుతున్నాయి. మరొకవైపు కొన్ని చోట్ల వానలు కూడా కురుస్తున్నాయి. ఆదిలాబాద్, కొమరం భీం, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అయితే మిగిలిన జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా నోదవుతాయని, వడగాల్పులు కూడా ఎక్కువగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ చెప్పింది. వడగాలుల వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్దులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓఆర్ఎస్, ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి తాగాలని,మంచినీరు ఎక్కువగా తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# బీజేపీ మాస్టర్ స్ట్రోక్....

హైదరాబాద్, ఏప్రిల్ 6, కూటమి వ్యూహం ఎవరికి అంతుపట్టడం లేదు. ముఖ్యంగా ఏపీ విషయంలో బిజెపి పెద్దల వైఖరి ప్రత్యర్థులకు కూడా అందడం లేదు. మొన్నటి వరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తెరవెనుక బిజెపి సహకారం అందిస్తుంది అనేది బలమైన ప్రచారం. అందుకు తగ్గట్టుగానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం బిజెపి అడగకుండానే పెద్ద ఎత్తున తన మద్దతు తెలుపుతూ వచ్చింది. అదే సమయంలో జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసులు, వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసు కు సంబంధించిన విచారణ జాప్యం వంటివి ఆ రెండు పార్టీల మధ్య స్నేహం ఉన్నట్టు అనుమానం కలిగించేలా ఉండేవి. మరోవైపు వైసీపీ నేతలు సైతం తమకు బిజెపి స్నేహం కొనసాగుతుందని అర్థం వచ్చేలా వ్యవహరించేవారు. కానీ అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో కేంద్రం తీసుకున్న చొరవ తో వైసీపీతో బిజెపి స్నేహం పై ఒక స్పష్టత వచ్చింది. వారి మధ్య ఎటువంటి సంబంధం లేదని తేలిపోయింది.మరోవైపు ఏపీలో సీఎం చంద్రబాబు తో పాటు ఆయన కుమారుడు, మంత్రి నారా లోకేష్ కు ఎనలేని ప్రాధాన్యం దక్కుతోంది. ఆయన అడిగిన వెంటనే ప్రధాని మోదీ అపాయింట్మెంట్ ఇస్తున్నారు. నిన్ననే ప్రధానిని కలిశారు లోకేష్. రాజ్యసభ గ్యాలరీలోకి వెళ్లారు. కేంద్ర మంత్రులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అయితే అటు నుంచి అడ్డు అన్నట్టు కర్ణాటక వెళ్లారు నారా లోకేష్. అక్కడ కేంద్ర మంత్రులతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లోకేష్ కు అక్కడ ఘనస్వాగతం లభించింది. ఉత్సాహంగా కర్ణాటకలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు లోకేష్.ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి రాజకీయాలు చేస్తున్నారు. ఢిల్లీ కాంగ్రెస్ ను వ్యతిరేకిస్తున్న ఆయన కర్ణాటక కాంగ్రెస్ సేవలను మాత్రం వినియోగించుకుంటున్నారన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీలో కూడా అదే అనుమానం ఉంది. వచ్చే ఎన్నికల్లో కర్ణాటకలో అధికారంలోకి రావాలని భావిస్తోంది బిజెపి. వైసీపీ భావజాలం కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా ఉంటుంది. అందుకే అది కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి వైసీపీ సహకరిస్తుంది అనేది బహిరంగ రహస్యం. అయితే ఇప్పుడు కర్ణాటకలో అధికారంలోకి రావాలంటే సరిహద్దు ప్రాంతాల్లో టిడిపి కూటమి సేవలను వినియోగించుకోవాలని చూస్తోంది బిజెపి. అందుకే లోకేష్ ను రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. మరోవైపు తమిళనాడులో పవన్ కళ్యాణ్ సేవలు వినియోగించుకుంటుంది. కర్ణాటకలో మాత్రం లోకేష్ సేవలను వినియోగించుకోవడం ద్వారా అధికారంలోకి రావాలని భావిస్తోంది. మొత్తానికి అయితే దక్షిణాది రాష్ట్రాల విషయంలో బిజెపి పెద్దలు గట్టి వ్యూహంతోనే ఉన్నారు.జగన్మోహన్ రెడ్డి బెంగళూరు నుంచి జాతీయ రాజకీయ పార్టీ నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారన్న అనుమానం బీజేపీలో ఉంది. ఎందుకంటే కర్ణాటక కాంగ్రెస్ పార్టీలో చాలామంది సన్నిహితులు జగన్ మోహన్ రెడ్డికి ఉన్నారు. అయితే తెలంగాణలో సైతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. కానీ అక్కడ చంద్రబాబు సన్నిహితుడు రేవంత్ రెడ్డి సీఎం గా ఉన్నారు. అందుకే జగన్ కర్ణాటకను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో ఉండి అక్కడి నేతల సహకారం తీసుకొని ఏపీలో రాజకీయాలు చేస్తున్నారు. ఈ సమాచారం బిజెపికి ఉండడం వల్లే లోకేష్ ను కర్ణాటకలో ప్రయోగిస్తోందన్న టాక్ వినిపిస్తోంది.

# గులాబీని కబళిస్తున్న కాళేశ్వరం

కరీంనగర్, ఏప్రిల్ 6, తెలంగాణ గర్వకారణంగా చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. రాజ్యసభలో అమరావతి బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో బీఆర్ఎస్ ఎంపీలు కాళేశ్వరం ప్రస్తావన తీసుకువచ్చారు. వారికి ఇదే సరైన చాన్స్ అనిపించింది. మూడు రోజుల కిందట కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ గట్టి కౌంటర్ ఇచ్చారు కాళేశ్వరం పేరుతో సుమారు లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం నీళ్లపాలైందని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్లానింగ్, డిజైన్ లోపాల వల్లే బ్యారేజీలు కుంగిపోయాయని, ప్రజలకు అందాల్సిన నీరు అందకుండా పోయిందని కేంద్రం స్పష్టం చేయడం బీఆర్ఎస్ వర్గాలనుగ్రాఖ్యంతికి గురిచేసింది. దాంతో పార్లమెంట్లో అమరావతి అంశంపై చర్చలోతమ ఆక్రోశాన్ని వెలిబుచ్చారు.తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి నుండి కాళేశ్వరాన్ని కూలేశ్వరం అని పిలుస్తూ వస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలు బయటపడటంతో ఆయన చేస్తున్న విమర్శలకు ఇప్పుడు కేంద్ర మంత్రి వ్యాఖ్యలు మరింత బలాన్ని చేకూర్చాయి. లక్ష కోట్ల వ్యయం చేసినా ఫలితం శూన్యమని కేంద్రం సాక్షాత్తూ పార్లమెంటులో ప్రకటించడం ద్వారా.. ఇటు కాంగ్రెస్, అటు బీజేపీ రెండు పార్టీలు బీఆర్ఎస్ హయాంలో అవినీతి జరిగిందని జాతీయ స్థాయిలో ముద్ర వేసినట్లయింది. ఇది బీఆర్ఎస్ నాయకత్వానికి మింగుడుపడని పరిణామంగా మారింది.రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీల నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. కాళేశ్వరం ప్రాజెక్టును గత ప్రభుత్వం ఒక ఏటీఎం లాగా వాడుకుందని ఆయన విమర్శించారు.

కేవలం కమీషన్ల కోసమే రీ–డిజైనింగ్ పేరుతో వేల కోట్లు అదనంగా ఖర్చు చేశారని విమర్శించారు. అమరావతికి అన్ని పార్టీలు మద్దతు ఇస్తున్న వేళ, బీఆర్ఎస్ సభ్యులు అనవసరంగా కాళేశ్వరం అంశాన్ని తెరపైకి తెచ్చి అబాసుపాలయ్యారని బీజేపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు. ఢిల్లీ స్థాయిలో కూడా ప్రాజెక్టు వైఫల్యంపై చర్చ జరగడం బీఆర్ఎస్ ఇమేజ్‌ను బాగా దెబ్బతీసింది.బ్యారేజీల కుంగుబాటుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇప్పటికే తీవ్రమైన లోపాలను ఎత్తిచూపింది. ఈ లోపాలపై ప్రస్తుతం విచారణ జరుగుతోందని, అది నెమ్మదిగా సాగుతోందని మంత్రి పాటిల్ పేర్కొన్నారు. అటు రాష్ట్రంలో విజిలెన్స్ విచారణ, ఇటు కేంద్ర సంస్థల నివేదికలు బీఆర్ఎస్ అధినాయకత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మీద కాళేశ్వరం అంశం బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద అడ్డంకిగా మారింది.

అటు కాంగ్రెస్ రాష్ట్ర స్థాయిలో, ఇటు బీజేపీ జాతీయ స్థాయిలో ప్రాజెక్టు వైఫల్యాన్ని ఎండగడుతుండటంతో ఆ పార్టీ సమాధానం చెప్పుకోలేక సతమతమవుతోంది. కేవలం ఒక బ్యారేజీ కుంగిపోవడమే కాకుండా, లక్ష కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్తోంది. దీనిని కవర్ చేసుకునే క్రమంలో చేస్తున్న ప్రయత్నాలు మరింత వివాదాలకు దారితీస్తుండటంతో గులాబీ దళం ప్రస్తుతం తీవ్ర నిర్వేదంలో ఉంది.

# పాకిస్తాన్ లో ఖాళీ అవుతున్న రాయబార కార్యాలయాలు

లాహోర్, ఏప్రిల్ 6, పాకిస్తాన్‌తో ప్రపంచ దేశాలు తెగదెంపులు చేసుకుంటున్నాయి. ఆ దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం.. మరోవైపు పాకిస్తాన్‌తో ప్రపంచానికి ప్రమాదం పొంచి ఉందన్న అమెరికా ఇంటలిజెన్స్ రిపోర్టుతో పాకిస్తాన్‌లోని పలు దేశాలు తమ కార్యాలయాను మూసివేస్తున్నాయి. తలుపులకు తాళాలు వేసి, దౌత్య సిబ్బంది వెళ్లిపోతున్నారు. ఇటీవల అమెరికా రాయబార కార్యాలయాలపై దాడులు జరగడం, ఒకటిరెండు మినహా మిగతా చోట్ల కార్యకలాపాలు నిలిపివేయడం ఈ పతనానికి నిదర్శనం. కరాచీలోని అమెరికా కాన్సులేట్‌ను పూర్తిగా మూసివేశారు. తాజాగా ఫిన్లాండ్ తన రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించిందిఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం, ఇరాన్‌పై అమెరికా?ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా పాకిస్తాన్‌లో హింసాత్మక ఆందోళనలు చెలరేగాయి. కరాచీలోని అమెరికా కాన్సులేట్‌పై నిరసనకారులు దాడి చేసి, భవనానికి నిప్పంటించారు. ఈ ఘర్షణల్లో 9?12 మంది పాకిస్తానీలు మృతి చెందారు, అమెరికా మెరైన్ గార్డ్స్ కాల్పులు జరిపారు. దీంతో అమెరికా తన కార్యకలాపాలను నిలిపివేసి, కరాచీ కార్యాలయాన్ని మూసివేసింది. ఇస్లామాబాద్, పెషావర్‌లలో కూడా నిరసనల భయంతో భద్రతను కట్టుదిట్టం చేశారు.ఫిన్లాండ్ ప్రభుత్వం పాకిస్తాన్‌లోని తన రాయబార కార్యాలయాన్ని 2026లో మూసివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ‘ఆపరేషనల్, వ్యూహాత్మక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నాం. పాకిస్తాన్ రాజకీయ పరిస్థితుల్లో మార్పులు, మాతో పరిమిత వాణిజ్య, ఆర్థిక సంబంధాలు ఇందుకు కారణం‘ అని ఫిన్లాండ్ విదేశాంగ మంత్రిత్వ శాఖ వివరించింది. ఇది కేవలం పాకిస్తాన్‌కే పరిమితం కాదు. ఆఫ్ఘనిస్తాన్ (కాబూల్), మయన్మార్ (యాంగోన్)లలో కూడా ఫిన్లాండ్ ఎంబసీలను మూసివేస్తున్నారు. 2012లో బడ్జెట్ పరిమితుల కారణంగా పాకిస్తాన్ ఎంబసీని మూసేసిన ఫిన్లాండ్, 2022లో మళ్లీ ప్రారంభించింది. ఇప్పుడు 2026లో మళ్లీ మూసివేయడం గమనార్హం.పాకిస్తాన్‌లో అనుకూల పరిస్థితులు లేకపోవడమే విదేశీ దేశాలు వెనుదిరగడానికి ప్రధాన కారణం. ఉగ్రవాద దాడులు, మతపరమైన హింస, రాజకీయ అస్థిరత విదేశీ దౌత్య సిబ్బందికి ముప్పుగా మారాయి. పాకిస్తాన్ దివాలా తీసే పరిస్థితిలో ఉండటం, విదేశీ మారకాల రిజర్వులు తగ్గడం వాణిజ్య సంబంధాలను దెబ్బతీశాయి. సౌదీ అరేబియా, యూఏఈ వంటి ఇస్లామిక్ దేశాలు పాకిస్తానీయులకు వీసాలు నిరాకరిస్తున్నాయి. భిక్షాటన, నేరాల కారణంగా పాకిస్తాన్‌పై వ్యతిరేకత పెరిగింది. ఇరాన్?అమెరికా యుద్ధం పాకిస్తాన్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. దౌత్య సంబంధాలు దెబ్బతినడం, రాయబార కార్యాలయాలపై దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంది.కరాచీ కాన్సులేట్‌ను అమెరికా మూసివేసింది. ఇస్లామాబాద్ ఎంబసీలో పరిమిత సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఫిన్‌లాండ్ పూర్తిగా మూసివేత, హ్యూస్టన్ (అమెరికా)లో కొత్త కాన్సులేట్ తెరవడం ద్వారా వ్యూహాత్మక మార్పు చేసింది. ఇతర ఐరోపా దేశాలు కూడా భద్రతా కారణాలతో సిబ్బందిని తగ్గించుకుంటున్నాయి. విదేశీ రాయబార కార్యాలయాల మూసివేత పాకిస్తాన్‌కు పెద్ద షాక్. దౌత్యపరంగా ఏకాంతమవుతున్న పాకిస్తాన్, అంతర్జాతీయ వేదికలపై తన గొంతు వినిపించుకోలేని పరిస్థితిలో పడింది. ఆర్థిక సహాయం, వాణిజ్య ఒప్పందాలు, వీసా సౌకర్యాలు దెబ్బతినడం ఖాయం.పాకిస్తాన్ ప్రభుత్వం భద్రత, ఆర్థిక స్థిరత్వాన్ని మెరుగుపర్చుకుని, విదేశీ దేశాలతో సంబంధాలను పునరుద్ధరించుకోవాల్సిన అత్యవసర పరిస్థితి నెలకొంది. లేకపోతే, మరిన్ని ఎంబసీలు మూతపడి, పాకిస్తాన్ అంతర్జాతీయంగా మరింత ఏకాంతమయ్యే ప్రమాదం ఉంది.

# పట్టు బిగిస్తున్న రేవంత్



హైదరాబాద్, ఏప్రిల్ 6, రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నికైన తొలి రోజుల్లో కాస్త ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత పరిపాలన మీద పట్టు సాధించడం మొదలుపెట్టారు. మంత్రుల మీద కూడా తన మార్క్ పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అధిష్టానం ఎదుట మంచి మార్కులు సాధించుకొని.. గట్టి లీడర్ గా ఎదిగారు. కర్ణాటక.. ఇంకా కొన్ని ప్రాంతాలలో అధికారంలో ఉన్నప్పటికీ.. ఆర్థిక పరిపుష్టి ఉన్న నాయకుడు కావడంతో అధిష్టానం రేవంత్ రెడ్డికి కేరళ బాధ్యతలు అప్పగించింది.దేశంలో ప్రస్తుతం ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇందులో కేరళ కూడా ఉంది. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ తరపున ప్రచారం చేస్తున్నారు రేవంత్ రెడ్డి. తెలంగాణ రాష్ట్రాన్ని చెందిన ఇతర ముఖ్య నేతలు కూడా ప్రస్తుతం కేరళలోనే మకాం వేశారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులు.. ఫైర్ బ్రాండ్ లీడర్లు.. గట్టి స్వరం ఉన్న నాయకులు కేరళ రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రచారం చేస్తున్న వారిలో దుద్దిల్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా ఉన్నారు. తన రాజకీయ జీవితంలో తొలిసారి కేరళ రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న రేవంత్ రెడ్డి.. కేరళ రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో నిర్వహిస్తున్న రోడ్డు షోలలో పాల్గొన్నారు. అక్కడ పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరఫున ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తున్కేరళ రాష్ట్రంలో అధికార భాషగా మలయాళం ఉంది. దక్షిణ భారతదేశంలో మలయాళం అనేది అత్యంత క్లిష్టమైన భాష. అందువల్లే రేవంత్ ఎన్నికల ప్రచారం చేస్తున్న సమయంలో.. ఒక అనువాదకుడిని నియమించుకుంటున్నారు.. “మలయాళ ప్రజలకు నమస్కారం.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయండి. కేరళ రాష్ట్రంలో అభివృద్ధి అంటే ఏంటో కాంగ్రెస్ పార్టీ చూపించింది. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి” అంటూ మలయాళంలో రేవంత్ రెడ్డి పలుకుతున్నారు. ఆ ప్రసంగాలకు సానుకూల స్పందన లభిస్తుంది. రేవంత్ రెడ్డి ఇంగ్లీషో్ల.. హిందీలో కూడా మాట్లాడగలిగే నైపుణ్యం ఉన్నవారు కాబట్టి.. ఆ రెండు భాషలలో మాట్లాడుతూ మలయాళ ఓటర్ల మనసు చూరగొనే ప్రయత్నం చేస్తున్నారు. కేరళ ప్రజలకు హిందీతోపాటు ఇంగ్లీష్ కూడా వస్తుంది. అందువల్లే తెలంగాణ సీఎం మాటలకు కాస్త రీచ్ కనిపిస్తోంది.రేవంత్ రెడ్డి తో పాటు శ్రీధర్ బాబు కూడా మలయాళ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. కేరళ రాష్ట్రంలోని మట్టుతారా నియోజకవర్గంలో రేవంత్ రెడ్డి రోడ్డు షో నిర్వహించారు. అక్కడ బహిరంగ సభ కూడా ఏర్పాటు చేశారు. కేరళ అభివృద్ధికి యుడిఎఫ్ కట్టుబడి ఉందని.. యు డి ఎఫ్ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.. ఇక ప్రచారంలో రేవంత్ రెడ్డి పదేపదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నారు. కేరళ ముఖ్యమంత్రి విజయన్ పై కూడా విమర్శలు చేస్తున్నారు. మతపరమైన రాజకీయాలను కేరళ ప్రజలు ఒప్పుకోరని.. మతాలపరంగా విడిపోవడానికి సిద్ధంగా ఉండరని రేవంత్ రెడ్డి అంటున్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెరచాటుగా ఒప్పందాలు చేసుకున్నారని.. కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి రాకుండా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు రేవంత్..కాగా, ఈ స్థాయిలో ప్రచారం చేస్తున్నప్పటికీ సర్వేలలో మాత్రం కేరళ రాష్ట్రంలో విజయన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని తెలుస్తోంది. ఎల్డిఎఫ్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటికీ గతంలో మాదిరిగా మెజారిటీ రాదని.. ఈసారి తగ్గే అవకాశం ఉందని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో ప్రస్తుత ముఖ్యమంత్రి కి తిరుగులేదని.. నగర ప్రాంతాలలో తీవ్రమైన వ్యతిరేకత కనిపిస్తోందని సర్వేలు చెబుతున్నాయి.. సర్వేలలో వచ్చిన నివేదికలను ఒకసారి పరిశీలిస్తే కేవలం 30 శాతం మంది మాత్రమే విజయన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని.. ఇతర వ్యక్తులు ప్రత్యామ్నాయం ఉంటే బాగుంటుందని చెబుతున్నారని తెలుస్తోంది. అయితే మిగతా పార్టీలలో అగ్ర నాయకులు అంత గొప్పగా లేకపోవడం విజయన్ కు కలిసి వస్తోంది.

# రోహిత్ రెడ్డికో ట్రీట్ మెంట్.. కవితకు మరోలా....

హైదరాబాద్, ఏప్రిల్ 6ధర్మం అనేది అందరికీ ఒక తీరుగా ఉండాలి. న్యాయం అనేది అందరికీ ఒకే విధంగా లభించాలి. తప్పు చేస్తే పడే శిక్ష కూడా సమానంగా ఉండాలి. అలా కాకుండా ఆశ్రిత పక్షపాతాన్ని చూపిస్తేనే ఇబ్బంది కలుగుతుంది.. ఇప్పుడు ఈ ఉపోద్ఘాతం మొత్తం ఎందుకంటే.. ఈ స్టోరీ చదవండి మీకే తెలుస్తుంది.లిక్కర్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొన్న తర్వాత కల్వకుంట్ల కవిత భారత రాష్ట్ర సమితి నుంచి ఒక రకమైన ఒత్తిడి ఎదుర్కొన్నారు. పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. అనేక రకాలుగా ప్రయాసపడితే ఆమె తండ్రి అపాయింట్మెంట్ లభించలేదు. అది కూడా నిమిషాల్లోనే జరిగిపోయింది. పార్టీలో తనకి ఎదురవుతున్న అనుభవాలను తట్టుకోలేక ఆమె విలేకరుల ముందుకు వచ్చారు. తన బాధను మొత్తం పంచుకున్నారు. ఆగమేఘాల మీద పార్టీ అధిష్టానం ఆమెను సస్పెండ్ చేసింది. దీంతో ఆమె పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసింది. ఇప్పుడు సొంత పార్టీ పెట్టే ఆలోచనలో ఆమె ఉంపార్టీ కోసం తాను ఎంతో కష్టపడితే ఇంత ఇబ్బంది పెడుతున్న క్రమంలో.. ఆమె వాస్తవాలను చెప్పడం మొదలుపెట్టారు. తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు భారత రాష్ట్ర సమితి పెద్దగా చేసింది ఏమీ లేదని.. సామాజిక తెలంగాణ ను ఏర్పాటు చేయడంలో భారత రాష్ట్ర సమితి విఫలమైందని ఆమె ఆరోపించారు. అంతేకాదు.. భూ కుంభకోణాలు.. ఇతర వ్యవహారాలను ఆమె బయట పెట్టుకుంటూ వస్తూనే ఉన్నారు. హరీష్ రావును గుంట నక్క అని.. సంతోష్ రావును అవకాశవాది అని ఆమె విమర్శించుకుంటూ వస్తున్నారు.ఇక ఇటీవల మొయినాబాద్ ఫామ్ హౌస్ లో మాదకద్రవ్యాల పార్టీ నిర్వహించి వివాదంలో చెప్పుకున్నారు తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి. ఆయన వ్యవసాయ క్షేత్రంలో మాదకద్రవ్యాలు లభించిన నేపథ్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వ్యవహారంలో పోలీసులపై కాల్పులకు పాల్పడేందుకు రోహిత్ రెడ్డి అనుచరులు ప్రయత్నించారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ వ్యవహారంలో ఇంకా చాలామందికి పాత్ర ఉందని పోలీసులు భావిస్తున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తూ కీలకమైన విషయాలను బయటపెడుతున్నారు.. మాదకద్రవ్యాల పార్టీ వెలుగులోకి వచ్చిన తర్వాత రోహిత్ రెడ్డికి ఆలస్యంగా భారత రాష్ట్ర సమితి షోకాజు నోటీస్ ఇచ్చింది. వారంలో దీనికి సమాధానం చెప్పాలని గడువు ఇచ్చింది.రోజులు గడుస్తున్న కొద్దీ ఇంతవరకు రోహిత్ రెడ్డి షో కాజు నోటీసుకు సమాధానం చెప్పలేదు. అంతేకాదు, ఇంతవరకు రోహిత్ రెడ్డి మీద భారత రాష్ట్ర సమితి కఠినమైన చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కవిత విషయంలో కఠినంగా వ్యవహరించిన భారత రాష్ట్ర సమితి.. రోహిత్ రెడ్డి విషయానికి వచ్చేసరికి సైలెంట్ అయిపోయింది. అతడు శోకాజ్ నోటీస్ కు సరైన స్థాయిలో సమాధానం ఇవ్వకపోయినప్పటికీ భారత రాష్ట్ర సమితి పట్టించుకోవడం లేదు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తాం.. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ద్రోహం చేసింది. ప్రజలను మోసం చేస్తోంది అని పదే పదే చెబుతున్న భారత రాష్ట్ర సమితి నాయకులు.. ఇంటి ఆడబిడ్డ విషయంలో ఒక విధంగా.. అభియోగాలు ఎదుర్కొంటున్న నాయకుడి విషయంలో మరొక విధంగా వ్యవహరించడం ఏ విలువలకు నిదర్శనం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. మరి దీనిపై భారత రాష్ట్ర సమితి అధినాయకత్వం ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది.

# ఏమౌతోంది... ఐఏఎస్ ఆఫీసర్లు,,,

కరీంనగర్, ఏప్రిల్ 6, భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు సీఎం ఓలో ప్రియాంక వర్గీస్, స్మిత సబర్వాల్ కీలక అధికారులుగా ఉండేవారు. వారితోపాటు జయేష్ రంజన్ కూడా ఉండేవాడు. సీనియర్ ఐఏఎస్ అధికారిగా.. అప్పట్లో ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించిన అధికారిగా జయేష్ సుపరిచితుడు. నాడు పరిశ్రమల శాఖ మంత్రిగా.. ఐటీ శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ కు అత్యంత సన్నిహితుడిగా ఉండేవాడు.భారత రాష్ట్ర సమితి అధికారం కోల్పోయిన తర్వాత కొద్ది రోజులపాటు రంజన్ ఐటీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెట్టుబడుల సదస్సు కోసం వెళ్ళినప్పుడు రంజన్ కూడా ఆయన వెంట ఉన్నారు. అయితేనాడు కుదుర్చుకున్న ఎం ఓ యు వ్యవహారాలలో లోపాలు ఉన్నాయని భారత రాష్ట్ర సమితి ఆరోపించింది. ఆ ఆరోపణలు తగ్గట్టుగానే ప్రభుత్వ వ్యవహార శైలి ఉండడం ఆందోళన కలిగించింది. చివరికి రంజన్ సెల్ఫీ వీడియో తీసి.. తెలంగాణ ప్రజలకు వివరణ ఇవ్వాల్సి వచ్చింది.ఈ ఉదంతం రంజన్ మీద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆగ్రహాన్ని కలిగించిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత గ్లోబల్ సమ్మిట్ విఫలం కావడంతో రంజన్ వ్యవహార శైలి పై మరోసారి చర్చ జరిగింది. గ్లోబల్ సమ్మిట్ జరిగేటప్పుడు కీలక సమాచారం భారత రాష్ట్ర సమితి చేతుల్లోకి వెళ్ళింది. దీంతో అప్పుడే ప్రభుత్వం అప్రమత్తమయింది. వెంటనే లోతుగా విచారణకు ఆదేశించింది. దీంతో కొంతమంది అధికారులు కావాలని ప్రభుత్వ సమాచారాన్ని ప్రతిపక్ష పార్టీకి అందిస్తున్నారని అందులో తేలింది. ఇక అప్పటినుంచి జయేష్ మీద ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అతడిని ఐటీ విభాగం నుంచి దూరం చేసింది. ఆ తర్వాత ఇప్పుడు సీఎం ఓ నుంచి కూడా పక్కనపెట్టింది. ఆయనకు క్రీడా శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చింది.గతంలో జయేష్ కేటీఆర్ కు దగ్గరగా ఉండటంవల్ల.. కీలకమైన విషయాలు ఆయన ద్వారా ప్రతిపక్ష పార్టీకి తెలుస్తున్నాయని ప్రభుత్వానికి సమాచారం ఉండడం వల్ల.. రేవంత్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత జయేష్ కు స్థానచలనం తప్పదని ప్రచారం జరిగింది. అయితే రేవంత్ ప్రభుత్వం కొద్దిరోజులపాటు అతడినే అదే శాఖలో కొనసాగించింది. చివరికి ప్రభుత్వం నుంచి కీలక సమాచారం బయటకు పోతున్న క్రమంలో.. ప్రక్షాళనకు రేవంత్ రెడ్డి నడుం బిగించారు. తన వేగుల ద్వారా సమాచారం తెప్పించుకుని.. సరైన సమయంలో.. సరైన విధంగా వేటు వేశారు. పైకి క్రీడాభివృద్ధి అని చెబుతున్నప్పటికీ .. అసలు అంతరార్థం వేరే ఉందని విశ్లేషకులు అంటున్నారు. మొత్తానికి సీఎంఓ నుంచి జయష్ ను పంపించడం ద్వారా పూర్తిగా ప్రక్షాళన చేసామని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. రేవంత్ వచ్చిన తర్వాత ప్రియాంక, స్మిత.. ఇప్పుడు జయేష్ సీఎం ఓ నుంచి బయటికి వెళ్లిపోయారు. స్మిత అనారోగ్యం వల్ల లాంగ్ లీవ్ లో ఉన్నారు.

# ఏపీలో తప్పని డోలీ మోతలు

పోలవరం జిల్లా రంపచోడవరం ఏజెన్సీలోని తడికోట గ్రామంలో చెట్టుపై నుండి పడి గిరిజనుడు చోళ్ల చిన్న రెడ్డి (20) తీవ్రంగా గాయపడ్డాడు. కదలలేని స్థితిలో ఉన్న చిన్న రెడ్డిని ఆసుపత్రికి తరలించేందుకు డోలి కట్టి ఐదు కిలోమీటర్లు గిరిజనులు మోసుకెళ్లారు. మధ్యలో ఏడు చోట్ల వాగులను అతి కష్టం మీద దాటి, 108 సిబ్బంది సహాయంతో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సంజయ్‌కుమార్ ఫిరాయింపుతో..





కరీంనగర్, ఏప్రిల్ 6, తెలంగాణ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌కు వెన్నెముకలా నిలిచిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి పార్టీ మారేందుకు సిద్ధమయ్యారు. 42 ఏళ్ల కాంగ్రెస్ అనుబంధానికి ఇటీవలే స్వస్తి పలికిన రాజకీయ కురువృద్ధుడు ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమయ్యాడు. జగిత్యాల నియోజకవర్గంలో జీవన్‌రెడ్డి అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి అనే రీతిలో రాజకీయం సాగింది. కానీ గత కొంత కాలంగా పార్టీ అంతర్గత పరిణామాలు, అవమానాలు ఆయనను తీవ్రంగా కలిచివేశాయి. దీంతో పార్టీకి గుడ్‌బైయ్ చెప్పాడు.

బీఆర్ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం జీవన్‌రెడ్డి నిర్ణయానికి ప్రధాన కారణమైంది. ఎన్నికల్లో జీవన్‌రెడ్డి ఓటమి పాలవగా, సంజయ్‌కుమార్ గెలిచారు. అనూహ్యంగా సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం, ఆయనకు ప్రభుత్వం, పార్టీలో ప్రాధాన్యత పెరగడం జీవన్‌రెడ్డికి మింగుడుపడలేదు. దీంతో కీలక నిర్ణయం తీసుకుని, గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధమయ్యారు. దీంతో ఇంతకాలం తిట్టిన గులాబీ పార్టీ నేతలతోనే త్వరలో పొగిడించుకోబోతున్నారు.జీవన్‌రెడ్డి చేరిక తర్వాత జగిత్యాల వేదికగానే బీఆర్ఎస్ ప్లీనరీ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏప్రిల్ 27న జగిత్యాల సమీపంలోని వ్యవసాయ భూముల్లో భారీ ఎత్తున ఈ సమావేశం నిర్వహించే యోచనలో అధిష్టానం ఉంది. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్న తర్వాత స్పష్టమైన ప్రకటన వెలువడే అవకాశం ఉంది. ప్లీనరీ సభ వేదిక మీదుగానే కేసీఆర్ జీవన్‌రెడ్డికి అప్పగించే బాధ్యతలను ప్రకటించనున్నారు. జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్న నేపథ్యంలో బలమైన సంకేతాలను పంపించేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలని కేసీఆర్ భావిస్తున్నారు.జీవన్‌రెడ్డి చేరికతో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ సమీకరణాలు మారనున్నాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కాంగ్రెస్‌కు బలమైన నేతను కోల్పోయినట్లైంది. బీఆర్ఎస్‌కు మాత్రం బలం చేకూరనుంది. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల అనంతరం పార్టీ అధిష్టానం పట్ల జీవన్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. కార్యకర్తలతో సుదీర్ఘ మంతనాల తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు.జీవన్‌రెడ్డి చేరికతోపాటు, ఆయనకు పార్టీలో కీలక బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా పర్యవేక్షణ బాధ్యతలు ఇవ్వవచ్చని తెలుస్తోంది. కేసీఆర్ హామీతోనే జీవన్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. జీవన్‌రెడ్డి చేరిక తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కానుంది. కాంగ్రెస్‌లోని ఇతర అసంతృప్త నేతలు కూడా బీఆర్ఎస్‌వైపు చూసే అవకాశం ఉంది. జగిత్యాల ప్లీనరీ ద్వారా బీఆర్ఎస్ తన బలాన్ని చాటుకోవాలని భావిస్తోంది.42 ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి తెరదించి, గులాబీ గూటికి చేరుతున్న జీవన్‌రెడ్డి నిర్ణయం తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపింది. జగిత్యాల వేదికగా జరగనున్న ప్లీనరీ ఈ మార్పుకు సాక్ష్యం నిలవనుంది.

# పాత పేరు కొత్త అజెండా



హైదరాబాద్, ఏప్రిల్ 6, తెలంగాణ రాజకీయ యవనికపై మరో కీలక మలుపునకు రంగం సిద్ధమవుతోంది. భారత రాష్ట్ర సమితి అగ్రనాయకత్వానికి ఊహించని షాక్ ఇస్తూ, కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత తన సొంత రాజకీయ అజెండాను సిద్ధం చేసుకుంటున్నారు. తాజాగా ఆమె మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ సెంటిమెంట్‌కు మారుపేరైన 'టీఆర్ఎస్' పేరును ఆమె ప్రస్తావించడం, బీఆర్ఎస్ ఉనికికే సవాలుగా మారేలా కనిపిస్తోంది. పరోక్షంగా తన భవిష్యత్తు రాజకీయ కార్యాచరణపై స్పష్టతనిచ్చారు. ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజుల దోపిడీపై చర్చించేందుకు పిలిచిన ఈ సమావేశంలో రాజకీయ ప్రశ్నలు ఎదురైనప్పుడు ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం టీఆర్ఎస్ పేరు ఫ్రీగా ఉంది.. దాన్ని ఎవరైనా వాడుకోవచ్చు" అని ఆమె అనడం వెనుక లోతైన వ్యూహం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తన పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల మేరకే నడుస్తుందని, తమకు ఇతర రాష్ట్రాల సిద్ధాంతకర్తలు అవసరం లేదని స్పష్టం చేయడం ద్వారా ఆమె నేరుగా బీఆర్ఎస్ ప్రస్తుత పోకడలపై విమర్శలు గుప్పించారు.2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి , రెండు దశాబ్దాల పోరాటం తర్వాత రాష్ట్రాన్ని సాధించి పెట్టింది. అయితే, 2022 అక్టోబర్ 5న జాతీయ రాజకీయాల కాంక్షతో కేసీఆర్ ఈ పేరును భారత రాష్ట్ర సమితి మార్చారు. ఈ నిర్ణయం చారిత్రక తప్పిదమని, దీనివల్ల తెలంగాణ అస్తిత్వంతో ఉన్న పేగుబంధం తెగిపోయిందని ఇప్పుడు పార్టీ శ్రేణులే భావిస్తున్నాయి.2023 అసెంబ్లీ ఎన్నికల్లో 39 సీట్లకే పరిమితం కావడం, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో బీఆర్ఎస్ తీవ్ర నైరాశ్యంలో ఉంది. సరిగ్గా ఈ సమయంలో కవిత మళ్లీ పాత పేరును తలకెత్తుకోవడం ద్వారా తెలంగాణ వాదులను, అసంతృప్త నేతలను తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు.కవిత తన మాటల్లో మరో కీలక అంశాన్ని ప్రస్తావించారు. తమ పార్టీలో బిహార్ సిద్ధాంతకర్తలు ఉండరని చెప్పడం ద్వారా బీఆర్ఎస్ నియమించుకున్న పొలిటికల్ స్ట్రాటజిస్టుల పెత్తనాన్ని ఆమె ఎండగట్టారు. ఇది నేరుగా కేటీఆర్ అనుసరిస్తున్న కార్పొరేట్ తరహా రాజకీయాలపై ఆమె చేసిన దాడిగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే శక్తి దానికి లేదని ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీలో అంతర్గత పోరును బహిర్గతం చేస్తున్నాయి.కవిత తన కొత్త పార్టీ పేరును, అజెండాను ఈ నెలాఖరున ప్రకటించే అవకాశం ఉంది. ఒకవేళ ఆమె నిజంగానే టీఆర్ఎస్ పేరుతో ముందుకు వస్తే బీఆర్ఎస్ నాయకత్వం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరం. తెలంగాణ ప్రజల గుండెల్లో టీఆర్ఎస్ అనే పేరుకు ఉన్న క్రేజ్ కవితకు ప్లస్ అయ్యే అవకాశం ఉంది. పాత ఉద్యమకారులు, క్షేత్రస్థాయి కార్యకర్తలు కవిత వైపు మొగ్గు చూపితే బీఆర్ఎస్ కు ఇబ్బందులు తలెత్తవచ్చు. కవితను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ చట్టపరమైన లేదా రాజకీయపరమైన ప్రయత్నాలు చేస్తే, అది ఆమెకు మరింత పబ్లిసిటీని తెచ్చిపెడుతుంది.తండ్రి వదులుకున్న అస్త్రమే ఇప్పుడు తనయకు ఆయుధంగా మారింది. పాత పేరు ? కొత్త అజెండాతో కవిత చేస్తున్న ఈ ప్రయోగం తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని ఏ విధంగా మారుస్తుందో చూడాలి. ఒకవేళ కవిత టీఆర్ఎస్ ను మళ్లీ బతికించగలిగితే, కేసీఆర్ వారసత్వాన్ని తానే కొనసాగిస్తున్నానని ఆమె క్లెయిమ్ చేసుకునే అవకాశం కలుగుతుంది.

## షార్ట్ ఫిలిం తీసేందుకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి

కడప ప్రమాదవశాత్తు నదిలో మునిగి ముగ్గురు యువకులు మృతిచెందారుఏ. ఇన్స్టాగ్రామ్ ద్వారా పరిచయమై, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన 8 మంది యువకులు "ఫ్రంట్లైన్ ప్రెస్" పేరిట షార్ట్ ఫిలిమ్స్ చిత్రీకరిస్తున్నారు.

కడప జిల్లా వల్లూరు మండలం పుష్పగిరి గ్రామ పరిధిలో ఉన్న పెన్నా నది వద్ద షార్ట్ ఫిలిం చిత్రీకరించేందుకు వెళ్లి, ప్రమాదవశాత్తు నీటిలో హరిబాబు(25), హర్షవర్ధన్(22), కృష్ణచైతన్య(20) మునిగిపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, గాలింపు చర్యలు చేయగా హరిబాబు, హర్షవర్ధన్ మృతదేహాలు లభించాయి. కృష్ణ చైతన్య మృతదేహం కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని కళింగ కల్చరల్ సెంటర్లో ఏర్పాటుచేసిన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను నగర సోషలైట్ పల్లవి ఠాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ చేనేతకారులు ప్రదర్శించిన వస్త్ర ఉత్పత్తులను ఆమె తిలకిస్తూ, చేనేతకారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలివిడిగా తిరిగారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగే ప్రదర్శనలో దేశంలోని 14 రాష్ట్రాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీ రియల్ వంటి 74 వేల రకాల వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంచారని వివరించారు.

# డ్రైవింగ్ లైసెన్స్ ఇక ఈజీ కాదు...

హైదరాబాద్, ఏప్రిల్ 6,డ్రైవింగ్ లైసెన్స్ దరఖాస్తుకు ముందే 'ఆన్‌లైన్ రోడ్డు భద్రత పరీక్ష' తప్పనిసరి కానుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రవాణా శాఖ ఈ ప్రతిపాదనను సిద్ధం చేస్తోంది. మూడు గంటల పాటు సాగే ఆరు వీడియో మాడ్యూల్స్ శిక్షణ పూర్తి చేస్తేనే ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు అవకాశం ఉంటుంది. రోడ్డు ప్రమాదాలను అరికట్టి, డ్రైవర్లలో క్రమశిక్షణ పెంచడమే ఈ కొత్త మూడు దశల విధానం ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు.రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియలో భారీ మార్పులు రాబోతున్నాయి. ఇకపై లెర్నర్స్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవటమే కాదు. అంతకంటే ముందే రోడ్డు భద్రతపై అవగాహన పరీక్షను పాస్ కావాల్సి ఉంటుంది. సుప్రీంకోర్టు జారీ చేసిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం.. డ్రైవింగ్ లైసెన్స్ పొందడం మరింత కఠినతరం కానుంది. ఈ మేరకు తెలంగాణ రవాణా శాఖ కసరత్తు చేస్తోంది.ప్రస్తుతం డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి ఎల్ఎల్ఆర్, ఫైనల్ డ్రైవింగ్ టెస్ట్ అనే రెండు దశలు ఉన్నాయి. ప్రతిపాదిత కొత్త విధానం అమల్లోకి వస్తే ఇది మూడు దశల ప్రక్రియగా మారుతుంది. దీని ప్రకారం.. అభ్యర్థి మొదట ఆన్‌లైన్ రోడ్డు భద్రతా అవగాహన పరీక్షను పూర్తి చేయాలి. దీనిపై ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశామని.. ఏప్రిల్ నెలాఖరు నాటికి నివేదిక వస్తుందని రవాణా శాఖ జాయింట్ కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ఈ పరీక్షను తప్పనిసరి చేస్తారు.ఈ ఆన్‌లైన్ శిక్షణ, పరీక్షా విధానం మొత్తం ఆరు మాడ్యూల్స్‌గా ఉంటుంది. ఒక్కో మాడ్యూల్ 30 నిమిషాల పాటు, మొత్తం 3 గంటల సమయం పడుతుంది. ఇందులో వీడియో ఆధారిత పాఠాలు, రోడ్డు భద్రతా క్రమశిక్షణ, ట్రాఫిక్ నిబంధనలపై శిక్షణ ఇస్తారు. ప్రతి మాడ్యూల్ చివరలో చిన్న పరీక్ష ఉంటుంది. అభ్యర్థులు తమ ఇంటి వద్దనే కెమెరా ఉన్న ల్యాప్‌టాప్ లేదా డెస్క్‌టాప్ ద్వారా ఈ పరీక్షను రాయవచ్చు. గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్లలో హాజరు కావచ్చు.ఈ శిక్షణలో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలకు దారితీసే కారణాలు, అద్దాల వినియోగం, సురక్షితంగా ఓవర్‌టేకింగ్ చేయడం వంటి అంశాలను వివరిస్తారు. వాస్తవ ప్రమాదాల వీడియోలను చూపిస్తూ డ్రైవర్లు చేసే పొరపాట్లపై అవగాహన కల్పిస్తారు. ఈ ఆన్‌లైన్ కోర్సు పూర్తి చేసిన తర్వాత ఒక యూనిక్ సర్టిఫికేట్ నంబర్ కేటాయిస్తారు. ఆ నంబర్ ఉంటేనే ఎల్ఎల్ఆర్ దరఖాస్తు చేసుకోవడానికి సాధ్యమవుతుంది.భారతదేశంలో ఏటా సుమారు 1.7 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. తెలంగాణలో కూడా మరణాల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. ఈ నేపథ్యంలోనే లైసెన్స్ జారీ చేసే ముందే రోడ్డు భద్రతపై ప్రాథమిక అవగాహన కల్పించడం వల్ల బాధ్యతాయుతమైన డ్రైవర్లను తయారు చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ డిజిటల్ విధానం వల్ల రవాణా కార్యాలయాల్లో దళారీల ప్రమేయం తగ్గి, పారదర్శకత పెరుగుతుందని రవాణా శాఖ ఆశిస్తోంది.

# అత్యుత్తమ క్రీడా వేదికగా గచ్చిబౌలి స్టేడియం



హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ హబ్ బోర్డు మీటింగ్ నిర్వహించారు. క్రీడా మౌలిక సదుపాయాలపై చర్చించారు. సీఎం మాట్లాడుతూ గచ్చిబౌలి స్టేడియాన్ని ప్రపంచ అత్యుత్తమ క్రీడా వేదికగా తీర్చిదిద్దాలన్నది నా ఆలోచన. జూన్ 2న స్టేడియం డెవలప్మెంట్ కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తామని అన్నారు. గచ్చిబైలి ఈ స్టేడియం లో హెలిప్యాడ్ తో సహా అన్ని ప్రపంచ స్థాయి సౌకర్యాలు ఏర్పాటు చేయాలి. స్టేడియం అభివృద్ధి పైన బోర్డు కు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని అన్నారు.

ఈ సమావేశంలో కొణిదెల ఉపాసన, కావ్యమారన్, సంజీవ్ గోయెంకా, సి.శశిధర్ , జయేష్ రంజన్, స్పోర్ట్స్ ఎండి సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకు వెళ్లిన కారు భార్యభర్తలు మృతి,



తూర్పుగోదావరి జిల్లా మండపేట మండలం తాపేశ్వరం శివారు కారు అదుపుతప్పి పంట కాలువలో దూసుకు వెళ్లడంతో కారులో వెళుతున్న భార్యాభర్తలు ఇద్దరు మృతి చెందిన సంఘటన తాపేశ్వరం శివారు పేకెటిపాకలలో చోటుచేసుకుంది. మండపేట రూరల్ సీఐ దొరరాజు తెలిపిన వివరాల ప్రకారం భోగిల్లి వీర వెంకట సతీష్(40), భార్య భోగిల్లి కిరణ్మయి(36), తల్లి, తండ్రి, తమ ఇద్దరి పిల్లలతో కలిసి ఈనెల 3వ తారీఖున కాకినాడలో తమ బంధువుల పెళ్లికి హాజరయ్యారు. పెళ్లి అనంతరం అక్కడ పనులు చక్కబెట్టుకొని రాత్రి స్వగ్రామం వెలగతోడు తిరిగి వస్తుండగా తాపేశ్వరం శివారు పేకెటిపాకలు వచ్చేసరికి కారు అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకు వెళ్ళిందని ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న భర్త ముందు సీట్లో కూర్చున్న భార్య ఇద్దరు మృతి చెందారని సీఐ తెలిపారు. అయితే వెనక సీటులో కూర్చున్న సతీష్ తల్లి, తండ్రి, అదే విధంగా ఇద్దరు చిన్నపిల్లలను స్థానికులు సకాలంలో స్పందించి రక్షించారని సీఐ తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే రూరల్ ఎస్సై కిషోర్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని క్రేన్ సహాయంతో కారును బయటకు తీసి మృతదేహాలను మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ఆకట్టుకున్న బనారస్ డిజైనరీ కలెక్షన్

ప్రముఖ డిజైనర్ మాధురి ప్రతివాది బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని ఎంప్రా లగ్జరీ పేరుతో ఏర్పాటు చేసిన కలెక్షన్ ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ డిజైనరీ కలెక్షన్ ఫెస్టో ప్రత్యేకంగా వారణాసిలోని బనారస్ ఘాట్ను ఓ చీరపై తీర్చిదిద్దిన తీరు నగర వస్త్ర ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. జపాన్ కు చెందిన కింజుకు ఆర్ను ప్రేరణగా తీసుకొని ఇండో వెస్ట్రన్ స్టైల్ లో దుస్తులు రూపొందించినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ఇన్ ఫ్లూయెన్సర్లు పాల్గొన్నారు.

## చికెన్ వేస్టేజ్ లారీ బోల్తా.. దుర్వాసనతో స్థానికుల అవస్థ

సూర్యాపేట మునగాల మండలం ముకుందాపురం వద్ద చికెన్ వేస్టేజ్ లోడ్ తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. హైద్రాబాద్ టూ విజయవాడ నేషనల్ హైవేపై చికెన్ వేస్టేజ్,కుళ్ళిపోయిన కోళ్లు చెల్లా చెదురుగా పడ్డాయి. ముక్కు పగిలేలా దుర్వాసనతో స్థానికులు,అటుగా వెళ్ళే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడ చేపల చెరువులో చికెన్ వేస్టేజ్ వేసేందుకు తీసుకెళ్తుండగా ఘటన జరిగినట్లు సమాచారం.

# ఎమర్జెన్సీ డోర్లు ఎక్కడున్నాయో తెలుసుకొండి

ఉయ్యూరు బస్సు రోడ్డు ప్రమాదానికి.. లేదా అగ్నిప్రమాదానికి గురైనపుడు ఎమర్జెన్సీ డోర్లు ఎక్కడ ఉన్నాయో తెలియక చాలామంది ఆందోళనకు గురవుతారు. ప్రయాణానికి ముందే బస్సులో తమకు కేటాయించిన సీట్లు.. ఎమర్జెన్సీ డోర్లు ఇతర రక్షణ సదుపాయాలపై ముందే జాగ్రత్తగా గమనించాలని ఉయ్యూరు ఆర్టీయే అధికారులు సూచించారు. కొన్ని బస్సుల్లో ప్రయాణికులకు అవగాహన కల్పించారు

## యాడికి జలధార కార్యక్రమంలో పాల్గోన్న సీఎం చంద్రబాబు

తాడిపత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం అనంతపురం జిల్లా, తాడిపత్రి నియోజకవర్గంలో పర్యటించారు. యాడికిలో జలధార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఫోటో ఎగ్జిబిషన్ను సందర్శించారు. జల సంరక్షణకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ కు సంబంధించిన వివరాలను ఫోటో ఎగ్జిబిషనులో అధికారులు ప్రదర్శించారు. హార్టికల్చర్ ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం ప్రజావేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

# దళారుల దందా కోసం కోహెడ ఫ్రూట్ మార్కెట్ భూములను అమ్మేస్తారా?

## రైతులకు ఉపయోగపడే 200 ఎకరాల కోహెడ మార్కెట్ భూమిపై రేవంత్ రెడ్డి కన్ను. హరీష్ రావు

### హైదరాబాద్ మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు కోహెడ పండ్ల మార్కెట్ను సందర్శించారు.



ఈ కార్యక్రమంలో హరీష్ రావు తోపాటు పాటు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్ తదితర నాయకులు పాల్గొనారు.

మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ ఈరోజు ఇక్కడికి రాజకీయాల కోసం రాలేదు రైతుల కోసం వచ్చాను. ఈ సమస్య బీఆర్ఎస్ పార్టీదో కాంగ్రెస్ పార్టీదో కాదు రైతుల సమస్య ఇది ఏ ప్రభుత్వమైనా రైతుల కోసం పనిచేయాలని దళారుల కోసం కాదని అన్నారు.

నేను ఈ వేదిక నుండి సీఎం రేవంత్ రెడ్డిని, వ్యవసాయ శాఖ మంత్రికి కోరుతున్నా.. లక్షలాది మంది రైతుల కోసం ఆలోచించండి తప్ప నలుగురు ఐదుగురు దళారుల కోసం కాదని అన్నారు. గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్లో ట్రాఫిక్ తగ్గించడానికి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇక్కడ 200 ఎకరాల్లో ఈ మార్కెట్ ను నిర్మించాలని ఆనాడు కెసిఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నేను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్నపుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి నాతో కొట్లాడి రూ.10 కోట్లను ఫ్రూట్ మార్కెట్ కోసం చేసిన భూసేకరణలో భాగంగా ఇక్కడ రైతులకి ఇప్పించారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ ఫ్రూట్ మార్కెట్ కట్టాలనుకున్నాం. 2020 సంవత్సరంలో జీవో 11 ద్వారా ఈ మార్కెట్ ను నోటిఫై చేశాం. జీవో 216 ప్రకారం రూ.350 కోట్ల డబ్బులను మార్కెట్ కోసం బ్యాంక్ అకౌంట్లో ఉంచాము..ఎలా కట్టాలని ప్లాన్ కూడా చేసామన్నారు. రూ.1,000 కోట్లతో డీపీఆర్ తయారు చేసాం, ఫ్యూచర్ లో ఇక్కడే ఫ్లవర్ మార్కెట్ రావాలి, ఫిష్ మార్కెట్ రావాలని తీర్చిదిద్దాం. 100 ఏండ్లను దృష్టిలో పెట్టుకొని మార్కెట్ కు రూపకల్పన చేశాం. డబ్బులు రెడీ, భూమి రెడీ అంతా రెడీగా ఉంది కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పని ముందుకు తీసుకపోగా ఈ భూమిని అమ్మాలని చూస్తున్నది. ఈ భూమి దాదాపు 3 వేల కోట్ల విలువ ఉంది. ఈ భూమిని ౦ఉఎఎఅ కి ఇచ్చి తమ వాళ్లకు కట్టబెట్టాలని చూస్తున్నది. రోజు 25 30 వేల రైతులకు ఉపయోగపడే వారి భవిష్యత్తు ముఖ్యమా ? నలుగురు ఐదుగురు వ్యాపారులు, దళారులు ముఖ్యమా ? రైతులు ముఖ్యమా ? వ్యాపారులు ముఖ్యమా? ఇక్కడ భూములకు ప్రత్యామ్నాయంగా దిల్ భూముల్లో మార్కెట్ కట్టిస్తాం అంటున్నారు. ఆ దిల్ భూముల జోలికి వెళ్లొద్దని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇన్వాల్వ్ ఉంది. ఎస్సీ రైతులు పంట పండిస్తున్నారు. అలాంటి భూమి ప్రత్యామ్నాయంగా ఇస్తామంటే ఎలా నమ్మాలి ? రేవంత్ రెడ్డికి భూముల మీద కన్ను పడిందని అన్నారు.

# జగ్గయ్య పేట - నందిగామ విజయవాడ మార్గంలో బస్సుల రద్దీ తీవ్రం



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్య పేట, నందిగమ నుండి విజయవాడకు వచ్చే బస్సుల్లో తీవ్ర రద్దీ నెలకొంది. ముఖ్యంగా జగ్గయ్యపేట ? విజయవాడ సర్వీసుల్లో ప్రయాణికులు అధిక సంఖ్యలో రావడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. నందిగామలో బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి...ప్రభుత్వం అమలు చేస్తున్న "శ్రీశక్తి పథకం" కారణంగా మహిళలు పెద్ద ఎత్తున బస్సుల ద్వారా ప్రయాణిస్తున్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు మహిళలు బారులు తీరడంతో బస్సుల్లో నిలబడే స్థలం కూడా లేకుండా పోతుంది.అయితే, పెరిగిన రద్దీకి అనుగుణంగా సరిపడా బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతోంది.ఇక ఎండాకాలం కావడంతో వేడి తీవ్రత పెరిగి, బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి రావడం వల్ల మహిళలు, వృద్ధులు, చిన్నారులు అల్లాడుతున్నారు....తక్షణమే అదనపు బస్సులను నడపాలని, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన



విజయవాడ మొక్కజొన్న రైతులను ఆదుకోవాలంటూ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద వైకాపా నేతలు ఆందోళనకు దిగారు. మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, రైతులతో కలిసి పీజీఆర్ఎస్ లో వినతిపత్రం అందించారు.

మొండితోక జగన్మోహనరావు మాట్లాడుతూ నందిగామ నియోజకవర్గం పరిధిలోని మొక్కజొన్న రైతులను తక్షణమే ఆదుకోవాలి. మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. నందిగామ పరిధిలో ఉన్న రెండు డిస్టిలరీలకు స్థానిక రైతుల నుంచి పంటను కొనుగోలు చేయించాలి. ప్రభుత్వం రైతుల నుంచి మొక్కజొన్నను కొని డిస్టిలరీకు అందించాలి. ప్రభుత్వం వెంటనే నందిగామ నియోజకవర్గాన్ని ప్రత్యేకంగా పరిగణించాలి. పంట చేతికొచ్చినప్పటికీ రైతుల నుంచి మొక్కజొన్న కొనడం లేదు. దళారులను ప్రోత్సహించడం కోసమే రైతుల నుంచి పంటను కొనడం లేదు. నందిగామలోని రెండు డిస్టిలరీలకు మొక్కజొన్నను కొనుగోలు చేయించాలి. లేని పక్షంలో రైతుల తరపున పోరాటం చేస్తామని అన్నారు.

## ట్రాన్స్ ఫర్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ వసూళ్లలో ఆలస్యాలు కంటు పడుతున్న అభివృద్ధి

సికింద్రాబాద్ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ట్రాన్స్ ఫర్ ఆఫ్ ప్రాపర్టీ టాక్స్ వసూళ్లలో జరుగుతున్న నిరంతర ఆలస్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యురాలు భానుక నర్మద అన్నారు. . బోర్డుకు చట్టబద్ధంగా రావలసిన ఆదాయం సమయానికి అందకపోవడం వల్ల అభివృద్ధి పనులు మరియు ప్రజా సేవలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని అన్నారు.

మధ్యవర్తిత్వ వ్యవస్థ కారణంగా ఏర్పడుతున్న ఈ ఆలస్యాలు అనవసరమైనవి మాత్రమే కాకుండా, కంటోన్మెంట్ బోర్డు ఆర్థిక స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయి. ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందించాలంటే, బోర్డు ఆర్థికంగా బలపడడం అత్యవసరమని అన్నారు. అసెంబ్లీ లో ఎమ్మెల్యే శ్రీగణేష్ కి మాట్లాడేందుకు 4 సార్లు అవకాశం వచ్చినా కంటోన్మెంట్ టీపీటీ ౦ బకాయిల విషయం లేవనెత్తకపోవడం దురదృష్టకరం. అంతే కాకుండా ఇప్పటి వరకు కంటోన్మెంట్ కు బకాయిలు ఉన్న సుమారు 100 కోట్ల రూపాయలు తక్షణమే ఛెల్లించె విధంగా క్రృషి ఛేయాలి. ప్రతిసారి అడుక్కోవడమే గాని రాష్ట్ర ప్రభుత్వం స్వతహాగా చెల్లించిన దాఖలాలు లేవు. టీపీటీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు ద్వారా నేరుగా వసూలు చేయుటకు తక్షణ నిర్ణయం తీసుకోవాలని నేను బలంగా డిమాండ్ చేస్తున్నాను.ప్రజల అభివృద్ధి, పారదర్శక పరిపాలన, మరియు వేగవంతమైన సేవల కోసం ఈ నిర్ణయం అత్యంత కీలకం. ఆలస్యం ఇక అస్సలు సహించమని ఆమె అన్నారు.

## ఉపాధి పనులు పరిశీలించిన ఎంపీడీవోరామచంద్రారెడ్డి

బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లెపల్లెలో జరుగుతున్న మహాత్మా గాంధీ మహాత్మా గాంధీ ఉపాధి పనులను సోమవారం బ్రహ్మంగారి మఠం మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం అమలు గురించి అక్కడ జరుగుతున్న పనుల గురించి సక్రమంగా జరుగుతున్నాయా అని అక్కడ పనిచేస్తున్న కూలీలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు మీరు పని చేసే పనులకు మీకు గిట్టుబాటు రేటు వస్తుందా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మీరు చేసిన పనులకు రావలసిన కూలీ డబ్బులు సకాలంలో వస్తున్నాయా, రావడం లేదా అని అడిగి తెలుసుకున్నారు. కూలీలందరూ కూడా సంతృప్తి వ్యక్తం చేయడంతో ఎంపీడీవో రామచంద్ర రెడ్డి కూడా ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఇలాగే రాబోయే రోజుల్లో కూడా ఎప్పుడైనా ఎక్కడైనా ఉపాధి కూలీలు కేవైనా ఇబ్బందులు అవాంతరాలు ఎదురైన పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం టి. చౌదరివారిపల్లె సచివాలయాన్ని మండల అభివృద్ధి అధికారి రామచంద్రారెడ్డి హాజరు పట్టిక తదితర వాటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

## కోహెడ ఫ్రూట్ మార్కెట్ స్థలాన్ని సందర్శించిన మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు, సబితా ఇంద్రారెడ్డి, సుధీర్ రెడ్డి , కాలేరు వెంకటేష్, క్యామ మల్లేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్



### మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

కేసీఆర్ దూరదృష్టితో ఆలోచన చేసి కోహెడలో ఫ్రూట్ మార్కెట్ ను పెట్టాలని ఆలోచన చేశారు.
ఆనాడు కోహెడ భూముల్లో అనేక మంది కబ్జాల్లో ఉన్నారు.
వారందరికీ ఒక్కొకరికి 7 లక్షల 50 వేల రూపాయలు కేటాయించి ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
17 కోట్ల రూపాయలతో
170 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి భూములను ఇచ్చారు.
350 కోట్ల రూపాయలతో కోహెడ ఫ్రూట్ మార్కెట్ ను అభివృద్ధి చేసుకోవాలని ఆనాడు బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూముల పై కన్నేసింది.
ఫ్రూట్ మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో ఈ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని భావిస్తుంది.
ఈ భూముల పై కేబినెట్ లో నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది , ఈ విషయం బయటకు రాకుండా దాస్తున్నారు.
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి భూముల పై కన్నేసింది.
నాదర్ గుల్ లో
374 ఎకరాలను అమ్మేందుకు సిద్ధమైతే మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆధారాలతో సహ బయటపెట్టారు.
ఫ్రూట్ మార్కెట్ కు కేటాయించిన కోహెడ భూముల పై స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లో అమ్మేందుకు సిద్ధమయ్యారు.
కోహెడ ఫ్రూట్ మార్కెట్ కు కేటాయించిన భూములను ఫ్రూట్ మార్కెట్ కే కేటాయించాలని డిమాండ్ చేస్తున్నాము.

### ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

గడ్డి అన్నారం నుంచి
కోహెడ మార్కెట్ కు తరలిస్తామని
గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్ ను 1985 లో ఏర్పాటు చెయ్యడం జరిగింది.
నగర విస్తరణలో భాగంగా గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్ నగరం నడిబొడ్డున అయింది.
అనేక ఫ్రూట్ వాహనాలు గడ్డి అన్నారం వచ్చి పోతుంటాయి, దీని ద్వారాగా కాలుష్య తీవ్రత మరింత ఎక్కువ అయింది.
కరోనా వైరస్ వచ్చినప్పుడు అనేక మందిమి ఇబ్బందులు ఎదుర్కొన్నాము.
ఆ సమయంలో గడ్డి అన్నారం దగ్గర ఆసుపత్రి నిర్మించాలని ఆలోచన మాజీ మంత్రి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు చేశారు.
అందుకే గడ్డి అన్నారం ఫ్రూట్ మార్కెట్ దగ్గర ఆసుపత్రి నిర్మిస్తే, అక్కడున్న ఫ్రూట్ మార్కెట్ ను కోహెడ కు తరలించాలని నిర్ణయం తీసుకున్నారు.
ఫ్రూట్ మార్కెట్ కోసం కోహెడ దగ్గర 170 ఎకరాల స్థలాన్ని సేకరించారు.
కోహెడ మార్కెట్ ను 350 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయాలని ఆనాడు కేసీఆర్, హరీష్ రావు నిర్ణయం తీసుకున్నారు.
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కోహెడ మార్కెట్ భూముల పై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నేసింది.
ఫ్రూట్ మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్ పేరుతో ఈ భూములను ప్రభుత్వం తీసుకోవాలని భావిస్తుంది.
ఫ్రూట్ మార్కెట్ కు కేటాయించిన భూములను ఫ్రూట్ మార్కెట్ కే కేటాయించాలని మేము డిమాండ్ చేస్తున్నాము.
కోహెడ ఫ్రూట్ మార్కెట్ కోసం మేము ఆనాడు తాత్కాలికంగా షేడ్స్ వేశాము.
గాలి వానకు షేడ్స్ కూలిపోతే కాంగ్రెస్ పార్టీ నాయకులు నానా రచ్చ చేశారు.
ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే
భారతదేశ వ్యాప్తంగా చాలా ఫేమస్ అయిన వ్యక్తి.
ఆయన పాన్ డబ్బా నుంచి మొదలు ఇడ్లీ బండి వరకు ఏది వదలడు.
తన మంత్రి పదవి కోసం మాజీ అమెరికా ఉప అధ్యక్షురాలు కమలా హారిస్ తో దొంగ లెటర్ ను రాహుల్ గాంధీకి రాయించారు.
అలాంటి వ్యక్తి కోహెడ భూముల పై కన్నేశారు.

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ఈ ప్రాంతంలో పెద్ద మార్కెట్ వస్తుందని రెండు మూడు రకాలుగా కేసీఆర్ ఆలోచన చేశారు.
ఫ్రూట్ మార్కెట్ కు కేటాయించిన భూములను రేవంత్ రెడ్డి స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నాడు.
ఇక్కడున్న మార్కెట్ ను ఎక్కడో గుట్టల్లో పెట్టేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైంది.
నాదర్ గుల్, కోహెడ భూముల పై ప్రభుత్వం కన్నేసి మొత్తం 10 వేల కోట్ల రూపాయలను దండుకోవాలని చూస్తున్నారు.
సూర్యుడు చుట్టు భూమి తిరిగినట్లు, భూముల చుట్టూ రేవంత్ రెడ్డి తిరుగుతున్నారు.
రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.
రెండేళ్లు పాటు ఈ కోహెడ మార్కెట్ స్థలాన్ని కాపాడుకుందాం.
బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఈ కోహెడ మార్కెట్ ను అభివృద్ధి చేసుకుందాం.

## బంజారా ప్రముఖులతో కవిత భేటి

హైదరాబాద్ బంజారా ప్రముఖులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భేటీ అయ్యారు. కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై, బంజారా సమాజ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సమాలోచనలు నిర్వహించారు. హైదరాబాద్ లోని రిటైర్డ్ అడిషనల్ డీజీ డీటీ నాయక్ నివాసానికి వెళ్లి కవిత మర్యాదపూర్వకంగా కలిసారు. ఆయనతో పాటు పలువురు బంజారా ప్రముఖులతో సమావేశమయ్యారు

# నాణ్యతమైన ఆహారంతోనే మెరుగైన జీవనం సాధ్యం.

## ప్రతి ఒక్కరూ తీసుకునే ఆహారంపై శ్రద్ధ వహించాలి.

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6 ములుగు**సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద “Eat Right Walkμμను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. జెండా ఊపి ప్రారంభించారు.




ఈట్ రైట్ వాక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నుంచి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు కొనసాగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలను చేపడుతుందని ఇందులో భాగంగా ఏప్రిల్ 6వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మొదటి రోజు జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద నుంచి డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ వరకు “జుఫ్ =అస్త్రఫ్ట్ ఝొశ్రీని”ను అవగాహన ర్యాలీని నిర్వహించామని తెలిపారు.

మనం తీసుకునే ఆహారం మన ఆరోగ్యంపై దాదాపు 90 శాతం ప్రభావం చూపుతుందని, మంచి ఆహారం తీసుకోవడం ద్వారా ఉత్తమ ఆరోగ్యం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతిరోజు ప్రజలు రోజువారి కార్యక్రమాల హడావిడిలో పని భారంతో కూడిన జీవనశైలిలో సతమతమవుతూ ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వకుండా అందుబాటులో బయట లభించే అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల చిన్న వయస్సులోనే క్యాన్సర్, గుండెపోటు వంటి ప్రమాదకర వ్యాధులు పెరుగుతున్నాయని, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు.

పొంచి ఉన్న అనారోగ్య ఉపద్రవాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ ఆహారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని సూచించారు.

ఆహారమే మహాభాగ్యం అనే అంశాన్ని గుర్తు చేసుకుంటూ జంక్ ఫుడ్ స్వస్తి పలుకుతూ తాజా కూరగాయలు, వేడి భోజనం, ఇంట్లో వంటకాలకు ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలు రోజువారీ జీవితంలో పండ్లు, కూరగాయలు అధికంగా తీసుకుంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు.

తిను బండారాలు, భోజనశాలలు, అల్పాహార కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, భోజన తయారీ ఉపయోగించే ముడి సరుకుల నాణ్యత ప్రమాణాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సి. హెచ్. మహేందర్ జి, డి ఎం హెచ్ ఓ గోపాలరావు, డి సి హెచ్ జగదీశ్వర్, డిఆర్డిఓ శ్రీనివాస్, డిపిఓ వెంకయ్య, సి. హెచ్.సి వైద్యాధికారి సురేష్, మున్సిపాలిటీ కమిషనర్ రమేష్, మహిళా సంఘాల సభ్యులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల సమస్య పరిష్కారానికై గ్రామస్తులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సర్పంచ్

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6** ఏటూరు నాగారం ఏటూరునాగారంలో కోతుల బెడదకు విముక్తి! మొదటి విడతగా 89 కోతులను పట్టి చతిస్గడ్ అడవిలో వదిలేయడం జరిగింది.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ, ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్రీమతి కాకులమర్రి శ్రీలత అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారు. గత కొంతకాలంగా గ్రామ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కోతుల సమస్యకు పరిష్కారం చూపుతానని ఎన్నికల సమయంలో ఆమె ఇచ్చిన మాటను నేడు అక్షరాలా అమలు చేసి చూపారు.

విజయవంతంగా ముగిసిన మొదటి విడత గ్రామస్తుల సౌకర్యార్థం సర్పంచ్ ప్రత్యేకంగా కోతులను పట్టే వారిని పిలిపించి ఇప్పటివరకు 89 కోతులను సురక్షితంగా పట్టుకోవడం జరిగింది. పట్టుకున్న కోతులను జనావాసాలకు దూరంగా ఉన్న దట్టమైన అడవి ప్రాంతంలో వదిలేయడం ద్వారా గ్రామంలో కోతుల భీభత్సం గణనీయంగా తగ్గింది.



సమస్య ఇంకా ఉంటే సంప్రదించండి: గ్రామంలో ఇంకా ఏ ప్రాంతాల్లోనైనా కోతుల బెడద కొనసాగుతుంటే, ఆయా వీధుల వారు లేదా వార్డు సభ్యులు వెంటనే ఉపసర్పంచ్ గారిని సంప్రదించి సమాచారం అందించాలని కోరుతున్నారు కోతుల నివారణ చర్యలు నిరంతరాయంగా కొనసాగుతాయని, గ్రామాన్ని కోతుల రహితంగా మార్చే వరకు ఈ ప్రక్రియ ఆగదని సర్పంచ్ భరోసా ఇచ్చారు. బిప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి, అసాధ్యమనుకున్న కోతుల నివారణను సుసాధ్యం చేస్తున్న సర్పంచ్ శ్రీలత గారికి గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో ఏటూరు నాగారం ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు పాల్గొన్నారు

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జెండా ఆవిష్కరణ

## మర్పల్లి మండల బిజెపి అధ్యక్షులు పి రామేశ్వర్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 6(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దామస్తాపూర్ లో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భవ దినోత్సవం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పట్లోళ్ల రమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి జెండా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈటి కార్యక్రమంలో పార్టీ నాయకులు మల్లేష్ యాదవ్ నరసింహారెడ్డి కళ్లెం మహేందర్ రెడ్డి విక్రమ్ రెడ్డి అంజిరెడ్డి పసుల నాగేష్ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# డ్రగ్ రహిత రాష్ట్రం లక్ష్యంగా దండి 2.ఓ పేరుతో సైకిల్ యాత్ర

తిరుపతి డ్రగ్ రహిత రాష్ట్రం లక్ష్యంగా దండి 2.ఓ పేరుతో సైకిల్ యాత్ర ప్రారంభం అయింది. వైబ్రంట్స్ ఆఫ్ కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. తిరుపతి నుంచి విశాఖ వరకు 13 ఉమ్మడి జిల్లాల్లో సైకిల్ యాత్ర సాగనుంది. తిరుపతి ఎస్వీయు ఆడిటోరియం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభమయింది. యువతతో పాటు ఆయా ప్రాంతాల్లో సైకిల్ యాత్రలో ఈగల్ టీం సభ్యులుపాల్గొన్నారు. యాత్రలో భాగంగా 25 విశ్వవిద్యాలయాలు, కళాశాలలో అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు జెండా ఊపి సైకిల్ యాత్రను ప్రారంభించారు.

# ప్రైవేట్ కాలేజీల కన్న ప్రభుత్వ కాలేజీలు మిన్న

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6** ఏటూరు నాగారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో న్యూ అడ్మిషన్ గా పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థుల ఇళ్లలోకి వెళ్లి తల్లిదండ్రులతో ప్రైవేట్ కళాశాలల కన్నా ప్రభుత్వ కళాశాలలో మిన్న అనే నినాదంతో ముందుకు దూసుకు వెళ్తున్న ప్రభుత్వ కళాశాల లేక్చరర్స్ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు స్థాయి పెంచాలని ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయానికి ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న లెక్చరర్స్ ఎండను సైతం లెక్కచేయకుండా ముందుకు వెళ్తూ విద్యార్థులను 2026 లో పెంచాలని ఉద్దేశంతో ఏటూరు నాగారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ బాదావత్ అశోక్ సౌరద్యం లో పనిచేస్తున్న మామిడి శంకర్ మర్రి రాంబాబు ఇద్దరు పదో తరగతి ముగుస్తున్న విద్యార్థుల ఇళ్లల్లోకి వెళ్లి తల్లిదండ్రుల తో ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు బోధిస్తున్న విద్యపై కొత్త కొత్త పద్ధతులతో విద్యాబోధన ఏర్పాటు చేస్తుందని ఈ ప్రభుత్వం విద్యార్థులకు అనువైన కాలేజ్ వాతావరణం గ్రౌండ్ మధ్యాహ్నం భోజనం వంటి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేస్తున్నాయని ప్రొఫెసర్లచే విద్యాబోధన జరుగుతుందని ప్రతి విద్యార్థి విద్యార్థినుల తల్లిదండ్రులు ప్రభుత్వ కాలేజీలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు





# సిరిపురంలో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం




**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 6 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మరిపల్లి మండలంభారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిరిపురం గ్రామంలో పార్టీ జెండాను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. లిఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య మండల ఉపాధ్యక్షులు పనే గారి శ్రీనివాస్ రెడ్డిమాజీ ఎంపీటీసీ పట్లోళ్ల బలవంత్ రెడ్డి సీనియర్ నాయకులు, రమణ గారి లక్ష్మారెడ్డి, తమ్మలి, సిద్ధి రాములు వరాల నారాయణరెడ్డి, చిన్నం గారి, ఆంజనేయులు, జంగం,ఉమాపతి ఆర్, నరసింహారెడ్డి, బోయిని మల్కయ్య కేసారం,మల్కయ్య భాగంగా గ్రామంలోని ముఖ్య కూడలి వద్ద పార్టీ శ్రేణులు, నాయకులు ఉత్సాహంగా పాల్గొని జెండా ఎగురవేశారుఅనంతరం జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో బిజెపి పాత్రను, పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# సెస్ విలీనం – ప్రయోజనమా? ప్రాణసంకటమా?




**రాజన్న సిరిసిల్ల జిల్లా ,ఏప్రిల్ 6 (ప్రజాబలం ప్రతినిధి)**సిరిసిల్ల: దశాబ్దాల చరిత్ర కలిగిన సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంస్థ (సెస్) మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకమైంది. ప్రభుత్వం ఈ సంస్థను ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టి జి ఎన్ పి డి సి ఎల్) విలీనం చేసేందుకు అడుగులు వేస్తుండటంతో, దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు అవినీతి, నష్టాల సాకుతో విలీనం అనివార్యమని కొందరు అంటుంటే, సహకార స్ఫూర్తిని దెబ్బతీయడమేనని మరికొందరు వాదిస్తున్నారు.

విలీనం వల్ల కలిగే లాభాలు (ప్రభుత్వ/అధికారుల వాదన):ఆర్థిక భరోసా: ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం ద్వారా సంస్థకు ఉన్న భారీ విద్యుత్ బకాయిల సమస్య తీరుతుందని, ఆర్థికంగా స్థిరత్వం లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.ఉద్యోగులకు వర్తించే రూ. 1 కోటి ప్రమాద బీమా వంటి సౌకర్యాలు సెస్ సిబ్బందికి కూడా అందుతాయి. ప్రభుత్వ సంస్థ కావడం వల్ల సబ్‌స్టేషన్ల ఆధునీకరణ, సాంకేతిక పరిజ్ఞానం పెంపు సులభమవుతుంది.ఏకరీతి ఛార్జీలు,సర్వీస్ లైన్ ఛార్జీలు, కనెక్షన్ ఫీజులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రమాణాల ప్రకారం అమలులోకి వస్తాయి.

విలీనం వల్ల కలిగే నష్టాలు (పాలకవర్గం/స్థానికుల ఆందోళన): సహకార స్ఫూర్తికి గండి: ఆసియాలోనే అతిపెద్ద సహకార విద్యుత్ సంస్థగా పేరున్న 'సెస్' తన స్వయంప్రతిపత్తిని కోల్పోతుంది. ఇది స్థానిక ప్రజల భాగస్వామ్యాన్ని దెబ్బతీస్తుంది. సేవలలో జాప్యం ఉండదని. ప్రస్తుతం స్థానిక సంస్థ కావడం వల్ల చిన్న సమస్య వచ్చినా సిబ్బంది వెంటనే స్పందిస్తున్నారు. విలీనం తర్వాత ప్రభుత్వ నిబంధనలు, పైస్థాయి అధికారుల ఆదేశాల కోసం వేచి చూడాల్సి వస్తుంది. మన సెస్ ఆస్తులు సుమారు రూ. 213 కోట్లకు పైగా విలువైన సెస్ సొంత ఆస్తులు ప్రభుత్వ పరం అవుతాయి.రాజకీయ జోక్యం:ఎన్నికైన పాలకవర్గం ప్రాధాన్యత తగ్గి, కేవలం అధికారుల పాలన సాగుతుందని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుత పరిస్థితి – సెస్ లైసెన్స్ గడువు ముగియడంతో ఇప్పటికే ఎన్‌పీడీసీఎల్ అధికారులు పగ్గాలు చేపట్టారు. అయితే, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే లైసెన్స్ రెన్యువల్‌ను ఆపిందని పాలకవర్గం ఆరోపిస్తోంది. ఈ వ్యవహారం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు పరిధిలో ఉండటంతో, కోర్టు తీర్పుపైనే సెస్ భవిష్యత్తు ఆధారపడి ఉంది.విలీనం జరిగితే సిబ్బందికి రక్షణ, ఆర్థిక వెసులుబాటు కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సిరిసిల్ల ప్రజల ఆత్మాభిమానంగా భావించే సహకార వ్యవస్థ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

# వన్ వే విధానాన్ని పరిశీలించిన సీపీ

హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రయోగాత్మకంగా చేపట్టిన వన్ వే విధానాన్ని పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ సోమవారం పరిశీలించారు. కేబీఆర్ పార్క్ మెయిన్ గేట్ నుంచి బసవతారకం ఆసుపత్రి, అగ్రసేన్ జంక్షన్, ఫిలిం నగర్, రోడ్ నంబర్ 45 మీదుగా జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వరకు వాహనాల రాకపోకలను పర్యవేక్షించారు.

# కల్తీ ఆహారంపై ఉక్కు పాదం మోపాలి

## (సి.హెచ్.ప్రతాప్)

ఆరోగ్యం మనిషి జీవితానికి అత్యంత విలువైన సంపద. అయితే నేటి సమాజంలో కల్తీ ఆహారం పెరుగుతున్న పరిస్థితి ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతోంది. లాభాల కోసం కొందరు వ్యాపారులు ఆహార పదార్థాల్లో కల్తీ చేసి మార్కెట్లోకి విడుదల చేయడం ఆందోళనకర విషయం. ఈ సమస్యను తక్షణమే అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

కల్తీ ఆహారం అనేది కేవలం నాణ్యత తగ్గిన పదార్థం మాత్రమే కాదు; అది ఆరోగ్యాన్ని నాశనం చేసే విషం. పాలు, నూనె, మసాలా పదార్థాలు, స్వీట్లు--- ఇలా రోజువారీ వినియోగంలో ఉన్న అనేక ఆహార పదార్థాల్లో కల్తీ జరుగుతోంది. రసాయనాలు, రంగులు, నాణ్యత లేని పదార్థాలు కలపడం వల్ల దీర్ఘకాలంలో గుండె సంబంధిత వ్యాధులు, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదకర రుగ్మతలు ఏర్పడే అవకాశం ఉంది.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం నియంత్రణ లోపం మరియు కఠిన చర్యల అమలు లేకపోవడం. ఆహార భద్రతా చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులు చట్టాలను పట్టించుకోకుండా ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే సమస్య మరింత విస్తరించే ప్రమాదం ఉంది.

ప్రభుత్వం ఈ విషయంలో ఉక్కు పాదం మోపాలి. ఆహార పరిశ్రమలపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. కల్తీకి పాల్పడిన వారిపై కఠిన శిక్షలు విధించాలి. లైసెన్సులు రద్దు చేయడం, భారీ జరిమానాలు విధించడం వంటి చర్యలు తీసుకోవాలి. అలాగే ప్రజలకు అవగాహన కల్పించడం కూడా ముఖ్యమైన అంశం.

సాంకేతికతను ఉపయోగించి కల్తీని గుర్తించే విధానాలను అభివృద్ధి చేయాలి. ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను విస్తరించి, తక్షణ ఫలితాలు అందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వినియోగదారులు కూడా జాగ్రత్తగా ఉండాలి. నాణ్యత లేని ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా అప్రమత్తంగా ఉండాలి.

పాఠశాల స్థాయి నుంచే ఆహార భద్రతపై అవగాహన పెంచడం అవసరం. సమాజం మొత్తం కలసి ఈ సమస్యను ఎదుర్కొంటేనే దీన్ని పూర్తిగా అరికట్టగలం. కల్తీ ఆహారం కేవలం ఒక నేరం కాదు; అది మన ఆరోగ్యంపై దాడి.

ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని కాపాడటానికి కల్తీ ఆహారంపై కఠిన చర్యలు తీసుకోవడం అత్యవసరం. చట్టాలు కఠినంగా అమలు అవుతూ, ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలము. కల్తీపై ఉక్కు పాదం మోపడం ఇప్పుడు కాలపరిమితి అవసరం.

# బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సంబరాలు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6** ఏటూరునాగారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఏటూరునాగారం వై జంక్షన్ వద్ద గాడి చెర్ల రాజశేఖర్ ప్రోగ్రాం మండల కన్వీనర్ ఆధ్వర్యంలో వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు శివావిలాల జనార్దన్ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు రి పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.?జెండా ఆవిష్కరణ: పార్టీ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం, భారత్ మాతా కీ జై అంటూ పార్టీ సిద్ధాంత కర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయల స్మరణార్థం నినాదాలు చేశారు.

బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వీట్లు పంపిణీ కార్యక్రమం చేశారు

జనార్ధన్ మాట్లాడుతూ

ప్రజలతో మమేకమై : క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త నడుం బిగించాలని పిలుపునిచ్చారు.

"1980, ఏప్రిల్ 6న స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించడం వెనుక లక్షలాది మంది కార్యకర్తల త్యాగాలు ఉన్నాయి. కేవలం అధికారం కోసమే కాకుండా, 'అంత్యోదయ' (చివరి వ్యక్తికి సైతం సంక్షేమం) లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. జాతీయవాదం, సుపరిపాలనే మన పార్టీ మూలస్తంభాలు."

ఈ కార్యక్రమంలో గద్దల హరిబాబు జిల్లా కౌన్సిలర్ వీనుకోళ్ల చక్రవర్తి మాజీ మండల అధ్యక్షులు దుర్గం దుర్గారావు మండల ఉపాధ్యక్షులు పలక గంగ మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు కందగట్ల రమేష్ ఓబీసీ మండల అధ్యక్షులు బొల్లె శీను మండల నాయకుడు లొట్ట పిట్టల అజిత్ ఓబీసీ మండల కార్యదర్శి ఆతుకూరి ప్రేమలత మండల మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు మలకం స్వరూప మండల నాయకురాలు పలక మమత రవళి తదితరులు భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన వధు వరులని ఆశీర్వదించిన యువనేత శ్రీ రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రెటరీ కుంజా సూర్య



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6 మంగపేట** మంగపేట మండలం లోని రాజుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్రీ పుల్లయ్య ఉ వెంకటరమణ దంపతుల మూడవ కుమార్తె కర్రీ మౌనిక ఉ పవన్ ల వివాహానికి హాజరై నూతన వధు వరులని ఆశీర్వధించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ సెక్రటరీ కుంజా సూర్య నూతన వధూవరులకు వస్త్రాలు అందజేశారు ఈ కార్యక్రమం లో...

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ ,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మారం సుమన్ రెడ్డి,జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యణయ్య, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ (కోఆర్డినేటర్ ) కర్రీ నాగేంద్ర బాబు, జిల్లా ప్రచార కమిటీ కార్యదర్శి కోడం బాలకృష్ణ,జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి నేపాల్ రావు,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమరం బాలన్న, కోడం రాము,గంగేర్ల రాజారత్నం, కాపుల నాగరాజు, కర్రీ వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు...

# 1812 రోజులుగా పేదలకు అండగా మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సేవలు



**ప్రజాబలం ప్రతినిధి (వేములవాడ ఏప్రిల్ -06)** వేములవాడ పట్టణంలో 1812 రోజులుగా భీమేశ్వర ఆలయానికి దర్శనానికి వచ్చే నిరుపేదలైన అనర్థులకు ఒక్క పూట తిండి పెట్టే ఉద్దేశంతో ముందుకు పోతున్న మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తున్న ప్రతి ఒక్కరికి ఆ రాజరాజేశ్వర స్వామి, భీమేశ్వర స్వామి ఆశీస్సులు ఉంటాయని అక్కడికి వచ్చే భక్తులు వారిని దీవిస్తున్నారు. ప్రతిరోజు పండగల రూపేనా కుటుంబ సభ్యుల పెళ్లిరోజు రూపేనా, పుట్టినరోజు రూపేనా, దాతలుగా కొనసాగుతూ నిత్యం అన్నదాన కార్యక్రమం చేస్తున్న మై చారిటబుల్ ట్రస్ట్ కు ప్రతి ఒక్కరు రుణపడి ఉంటారని దాతలు అంటున్నారు.

# సరైన ఆహారం తీసుకోండి-ఆరోగ్యంగా జీవించండి కలెక్టర్ & జిల్లా మెజిస్ట్రేట్ శ్రీబాదావత్ సంతోష్




సరియైన, సురక్షితమైన పౌష్టికాహారం తీసుకోండి ఆరోగ్యంగా జీవించండి అని నాగర్ కర్నూల్ కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ బాధావత్ సంతోష్ తెలిపారు.సోమవారం నాడు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఈట్ రైట్ వాకతాన్ ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురక్షితమైన ఆరోగ్యకరమైన పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థులు,యువత చిప్స్,కేకులు,న్యూడిల్స్, కార్బోనేటెడ్ కూల్ డ్రింక్స్ తదితర జంక్ ఫుడ్ తీసుకోకుండా సీజన్లో చౌకగా స్థానికంగా దొరికే పండ్లను తీసుకోవాలని, ఉప్పు,చక్కెర,నూనెలు తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని తెలిపారు. ప్రతిరోజు ఆహారములో ఆకుకూరలు,కాయగూరలు,స్థానికంగా దొరికే పండ్లు,జొన్నలు, రాగులు,సజ్జలు తదితర తృణధాన్యాలు తీసుకోవాలి అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె రవికుమార్, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ టి.ఉషారాణి,ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శ్రీలత రెడ్డి, ఆర్ఎంఓలు, హెడ్ నర్సులు, నర్సింగ్ అధికారులు, నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఇతర సిబ్బంది,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కృష్ణమోహన్,డాక్టర్ సురేష్ బాబు,డాక్టర్ ప్రదీప్,డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి,ఉప జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలచారి,డి పి ఓ రేనయ్య, పర్యవేక్షణ సిబ్బంది వై శ్రీను, సుకుమార్ రెడ్డి,విజయ్ కుమార్, విజయ్,రాజేష్, బంగారయ్య, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటేష్,కళ్యాణ్ కృష్ణ,ఎ ఎన్ఎంలు సరస్వతి, జిజే కవిత ఆశా కార్యకర్తలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# గిరివాణి, ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి. జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 6 04 2026**గిరివాణి, ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ఇంచార్జ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ దివాకర టి.ఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు.



సోమవారం ఐటీడీఏ ఏటూరునాగారం సమావేశ మందిరంలో ప్రజావాణి - గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు.

అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

గిరివాణి (గిరిజన దర్బార్) కార్యక్రమానికి 60, ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, ఏ పి ఓ వసంత రావు, ఆర్డీఓ వెంకటేష్, డి డి జనార్దన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, ఐటిడిఏ ఎస్ ఓ, తహసీల్దార్లు, ఎంపి డి ఓ లు, ఎం పి ఓ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర ఆలయంలో భక్తుల రద్దీ -- ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జ్ ఈవో అంజనా రెడ్డి



**ప్రజాబలం ప్రతినిధి వేములవాడ ఏప్రిల్ -6** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తుల తాకిడి ఎక్కువైంది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ఆలయ ఇంచార్జ్ ఈవో అంజనా రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు.

ఆలయంలో నిర్వహిస్తున్న లడ్డు తయారీ విభాగం, లడ్డు కౌంటర్, పులిహోర ప్రసాదం నాణ్యత, అలాగే అన్నదాన సత్రంలో భక్తులకు అందిస్తున్న భోజన సదుపాయంను పరిశీలించారు. అంతేకాకుండా నిత్య కళ్యాణం నిర్వహణ, సంబంధిత రికార్డులు, భక్తులకు తాగునీరు అందించే చలివేంద్ర కేంద్రం వంటి సౌకర్యాలను పరిశీలించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.



ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో ఆలయ ఉద్యోగులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో కుక్కలు ఎందుకు ప్రమాదకరం

కడప వేసవిలో కుక్కలు ఎక్కువగా కరిచే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.అధిక ఉష్ణోగ్రతల కారణంగా, అసౌకర్యం పెరిగి చికాకు కలుగుతుంది మరియు అవి తమ దగ్గరకు వచ్చే ఎవరిపైనైనా దాడి చేయవచ్చు.వాటికి నీరు అందకపోతే, అవి నిర్జలీకరణకు గురై దూకుడుగా ప్రవర్తిస్తాయి.చాలా కుక్కలు వేసవిలో కుక్కపిల్లలకు జన్మనిస్తాయి.ఆ సమయంలో, దగ్గరకు వచ్చే వారిని ప్రమాదంగా భావించి, తమ పిల్లలను కాపాడుకోవడానికి అవి కరుస్తాయి.కుక్కల దగ్గరకు వెళ్లకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి...

## ఘనంగా 46వ భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుక

## జెండాను ఆవిష్కరించిన పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్



**ప్రజాబలం ప్రతినిధి (వేములాడ ఏప్రిల్ -6 )** భారతీయ జనతా పార్టీ 46 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణ శాఖ ఆధ్వర్యంలో వేములవాడ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ పార్టీ జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ 1980లో భారతీయ జన సంగ్ గా స్థాపించబడ్డ పార్టీ కేవలం రెండు ఎంపీ సీట్లలో ప్రారంభించి ఇప్పుడు భారత దేశంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో వరుసగా మూడోసారి నాయకత్వం వహించడం జరుగుతుందని, రాజకీయ పార్టీ అయినప్పటికీ కేవలం దేశం కోసం ధర్మం కోసం మాత్రమే పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నింటి హనుమాన్లు, రేగుల రాజ్ కుమార్, బోనాల శివ, వివేక్ రెడ్డి, అన్నం నరసయ్య, నామాల శేఖర్, నేరేళ్ల సాయి, బిల్ల కృష్ణ ,గుడిసె మనోజ్ కేసరి యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు



## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశాలు

## ప్రారంభించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 06 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** టేక్మాల్ మండల కేంద్రంలో, స్వప్న శివరాజు, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు, ఈరోజు సోమవారం, గృహప్రవేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు, ఈ సందర్భంగా నిమ్మ రమేష్, మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలను హక్కున చేర్చుకొని, ఆదుకునేది కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వం అని అన్నారు, ఇల్లు లేని పేదలను గుర్తించి, వారికి ఇల్లు మంజూరు చేశామని అన్నారు, పార్టీల కతీతంగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించడంలో, ఇందిరమ్మ కమిటీ సభ్యుల పాత్ర కీలకమని అన్నారు, ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి, ఆషీలి విద్యాసాగర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజర్, టౌన్ ప్రెసిడెంట్ కిషోర్,





ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బాలమణి ధనుంజయ, శ్రావణి, శివగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 253 దరఖాస్తులు

## . స్వీకరించిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్



**రాజన్న సిరిసిల్లజిల్లా, ఏప్రిల్ -06 (ప్రజా బలం ప్రతినిధి)**జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అర్జీలు స్వీకరించారు. అర్జీలు పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 253 దరఖాస్తులు వచ్చాయి.రెవెన్యూ శాఖకు 67, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి 64, హౌసింగ్ శాఖకు 46, జిల్లా పంచాయతీ అధికారికి 13, జిల్లా ఉపాధి కల్పనాధికారికి 9, జిల్లా విద్యాధికారికి 6, జిల్లా సంక్షేమ అధికారికి 5, నీటి పారుదల శాఖ, సెస్ సంస్థ, ఎస్డీసీ, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారికి నాలుగు చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా వైద్యాధికారి, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు మూడు చొప్పున, జిల్లా అటవీశాఖ అధికారి, సబ్ రిజిస్ట్రార్ సిరిసిల్ల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సిరిసిల్లకు రెండు చొప్పున, చేనేత చేనేత శాఖ, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, జిల్లా మైనింగ్ అధికారి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిజిల్లా పౌర సంబంధాల అధికారి, ఈ డీ ఎం, ఆర్ అండ్ బీ అధికారి, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఎస్పీ కార్యాలయానికి ఒకటి చొప్పున దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందించి, పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణి లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధా భాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు

## ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలి

## కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 06:**ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మను చౌదరి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్ఓ చంద్రావతి తో కలిసి కలెక్టరు (177) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సభాపతిని కలిసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా

## ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి





**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 6 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం మర్పల్లి మండల సీనియర్ నాయకులు ఎంతో నిరీక్షణతో కాంగ్రెస్ పార్టీకి తోడుగా ఉండి ఎన్నో కార్యక్రమాల్లో తన వంతు కృషి సహాయ సహకారాలు అందించిన సీనియర్ నాయకులు నేడు పెద్దలు గుర్తించి వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా వికారాబాద్ శాసనసభ్యులు తెలంగాణ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ని కలిసి శాలువాతో సన్మానం చేసిపుష్పగుచ్చం ఇచ్చి సంతోషం వ్యక్తపరిచారు అదేవిధంగా మర్పల్లి మండల నాయకులు తెలంగాణ రాష్ట్ర సీనియర్ నాయకులు పెద్దలు హనుమంతరావుని కూడా మర్యాదపూర్వకంగా కలిసి ముచ్చటించి సంతోషం వ్యక్తపరిచినట్టు తెలిపారు

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

## బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 06:** ఉప్పల్ నియోజకవర్గంలోని

కాప్రా సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని బీజేపీ స్థాపన లక్ష్యాలు, సిద్ధాంతాలను గుర్తుచేసుకున్నారు. తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ అభివృద్ధి, సుశాసనం, ప్రజాసేవలో బీజేపీ పార్టీ పోషిస్తున్న పాత్రను వివరించారు. పార్టీ కార్యకర్తలు ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నాయకులు బీజేపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన

## అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు.



ములుగు జిల్లా అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు నేడు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పుల బొకే అందించి సాల్వతో సత్కరించారు. ఈ నెల 14 నా జరిగే అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు.

అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్. జిల్లా షెడ్యూల్ కులాల అధికారి కొమురయ్య ను, కాల్వతో సత్కరించి పూల బొకే అందించారు .

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ జన్ను రవి. వైస్ చైర్మన్. రెంటాల బిక్షపతి. బుర్రి సతీష్. ఓరుగంటి అనిల్. కమిటీ సభ్యులు,లాదేళ్ల అశోకు.మరాఠి రవీందర్.మాదారపు రాజు.ఆలూవాలా రాజకుమార్. కాడపాక

# రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలు వేసినందుకు భారీ జరిమానా




**రాజన్న సిరిసిల్ల జిల్లా ?, ఏప్రిల్ 06 ( ప్రజాబలం ప్రతినిధి)** సిరిసిల్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే చర్యల్లో భాగంగా మున్సిపల్ అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా సోమవారం చంద్రంపేట 12వ వార్డులో రోడ్డుపై ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేసిన వ్యక్తికి 5,000 రూపాయల భారీ జరిమానా విధించారు.?పట్టణంలోని ప్రధాన రహదారులు మరియు నివాస ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా చెత్తను, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేయడం వల్ల ప్రజారోగ్యానికి పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య నియమాలను పాటించాలని, చెత్తను మున్సిపల్ వాహనాలకే అందించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని, భారీ జరిమానాలతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.?ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ కిరణ్‌తో పాటు మున్సిపల్ జవాన్ ప్రవీణ్ మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# అల్లాదుర్గం డిప్యూటీ ఇంజనీర్గా విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన ప్రభాకర్ ను సన్మానించిన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 06 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, అల్లాదుర్గం మండలం డిప్యూటీ ఇంజనీర్ గా ఇంజనీర్గా, విధులు నిర్వహించి, పదవి విరమణ పొందిన, ప్రభాకర్ ను, సన్మానించిన, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, మరియు సర్పంచ్ సుధాకర్, ఆర్టిఏ మెంబర్ మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, డి సి సి కార్యదర్శి ఆషిల్ విద్యాసాగర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజార్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మణి కిషన్, మాజీ వైస్ ఎంపీపీ విష్ణు వర్ధన్ రెడ్డి, మాజీ డైరెక్టర్ పాపయ్య, సర్పంచి భూమిరెడ్డి, నాయకులు రామచందర్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు...

# పట్లూర్ మురళి చారి కుమారుని బర్త్డే లో పాల్గొన్న పట్లూర్ మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 6 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ మురళి చారి ప్రభుత్వ సర్వే రు గా విధులు నిర్వహిస్తున్నారు వారి కుమార్తె బర్త్ డే కు హాజరై కుటుంబ సభ్యులతో ఆనందంగా ముచ్చటించి పాప నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆశీర్వదించి న పట్లూర్ మాజీ సర్పంచ్ దేవర దేశి ఇందిరా అశోక్ సంతోషం వ్యక్తపరిచారు

# ఈరోజు నూతన తైబజారు ప్రారంభించిన మేజర్ గ్రామ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 06?(ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** మేజర్ టేక్మాల్ గ్రామపంచాయతీ నూతన తైబజారు, ను ప్రారంబం చేసిన గ్రామ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్, ఉప సర్పంచ్ మేకలకాడి శంకరయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిమ్మరమేష్, డీసీసీ కార్యదర్శి విద్యాసాగర్, టౌన్ పార్టీ అధ్యక్షులు భక్తుల కిషోర్, మాజీ కోపరేటివ్ డైరెక్టర్ ఆకులపల్లి పాపయ్య, వార్డ్ మెంబర్ సాధశివా గౌడ్, ఆగమాన్నోళ్ల భాగ్యలక్ష్మి, భోగం బాలకృష్ణ,దొండ్ల మోహన్, సోలాపూర్ రాజు, కుమ్మరి ధనంజయ్య, ఎర్రోళ్ల రమేష్, గుమ్మడి దేవేందర్, చాకలి యాదయ్య, చింత శివ, పార్టీ కార్యకర్తలు పాల్గొని నూతన తైబజార్ ను ప్రారంభించడం జరిగింద......

# కోర్టు ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభించిన సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్



**ప్రజాబలం ప్రతినిధి వేములాడ ఏప్రిల్ -06** ఎండాకాలం తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో కోర్టుకు వచ్చే కక్షదారుల సౌకర్యార్థం వేములవాడ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ, కోర్టుకు విచారణల కోసం వచ్చే కక్షదారులు, న్యాయవాదులు, ఎండ తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారని వారికి తాగునీటి సౌకర్యం అందించడం ద్వారా కొంతవరకు ఉపశమనం చెందుతారని చలివేంద్రం ద్వారా శు



ద్ధమైన చల్లని తాగునీరు అందుబాటులో ఉండటంతో కోర్టుకు వచ్చే వారికి ఇది ఎంతో ఉపయోగకరంగా మారుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పిట్టల మనోహర్, ప్రధాన కార్యదర్శి పుప్పాల భాను కృష్ణ, జాయింట్ సెక్రెటరీ కనికరపు శ్రీనివాస్, కోశాధికారి జెట్టి శేఖర్, లైబ్రరీ సెక్రటరీ మొగిలి సుజాత, మహిళ ప్రతినిధి తమిరి అన్నపూర్ణ, సీనియర్ ఈసీ మెంబర్ మారు ముఖం అనిల్ కుమార్, జూనియర్ ఈసీ మెంబర్ ఉల్లెందుల అనిల్, సబ్ కోర్టు ఏజీపీ బొడ్డు ప్రశాంత్ కుమార్, ఏపీపీ అవధూత రజనీకాంత్, సీనియర్ న్యాయవాదులు నేరెళ్ల తిరుమల్ గౌడ్, గుడిసె సదానందం, రేగుల దేవేందర్, కిషోర్ రావు, గడ్డం సత్యనారాయణ రెడ్డి, మాదాసు దేవయ్య, నక్క దివాకర్, రేగుల రాజ్ కుమార్, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజాసేవే లక్ష్యం

# ఎండల వేళ ప్రజలకు ఉపశమనం -- నాచారం హెచ్ఎంటి నగర్‌లో చలివేంద్రం ప్రారంభం

## బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 06:** ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం హెచ్ఎంటి నగర్ కమాన్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా తాడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ, పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇటువంటి చలివేంద్రాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు, దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఉపయోగపడుతాయని తెలిపారు.

ప్రజలకు సేవ చేయడం బీజేపీ పార్టీ ప్రధాన లక్ష్యమని, ముఖ్యంగా వేసవి కాలంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజానికి తోడ్పాటు అందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాగిరి జ్యోతి మోహన్ రెడ్డి, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రజలు ఆహార భద్రతలో రాజీ పడొద్దు :: జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.




**ములుగు జిల్లా ప్రజా బలం ప్రతినిధి ఏప్రిల్ 6 ములుగు** ప్రజలందరూ ఆహార భద్రత నాణ్యత విషయంలో రాజీ పడవద్దని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి అన్నారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా ఆరోగ్య వారోత్సవాలలో ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డే పై జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ మహేందర్ జి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ కూడా ఆహార భద్రత విషయంలో రాజీ పడకూడదని నాణ్యమైన ఆహారం ద్వారానే మెరుగైన ఆరోగ్యం సాధ్యపడుతుందని పేర్కొన్నారు.

ఆహార ముడి పదార్థాలు కొనుగలు చేసే సమయంలో తప్పనిసరిగా గడువు తేదీ ప్యాకింగ్ తయారీ తేదీ క్షుణ్ణంగా పరిశీలించాలని గడువు తీరిన వస్తువులను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని సూచించారు.పాఠశాలలో, వసతి గృహాలలో విద్యార్థులకు అందించే భోజనం పట్ల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తాజా కూరగాయలను మాత్రమే ఉపయోగించాలని వంట చేసే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.హోటల్స్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ స్వీట్ హౌస్ నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, వాటిపై ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ ఓ వేణుగోపాలరావు, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ జోనల్ ఆఫీసర్, ట్రైబల్ వెల్ఫేర్ డిడి జనార్ధన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com